సెప్టెంబర్ 18
వినాయక చవితి

సంపుటి 2 సంచిక 1 | సెప్టెంబర్ 2023

# గురువాణి

శ్రీవిద్యా జ్ఞాన పీఠం ఆధ్యాత్మిక మాస పత్రిక



## అంతరార్థము
శ్రీ దేవి ఖడ్గమాల

## గురువాణి
వర్తమానంలో జీవించడమే సాధన

## శ్రీవిద్యా మందిరాలు
శ్రీ దుర్గాభవానీ ఆలయం

## శ్రీవిద్యా సాధన
శ్రీ భువనేశ్వరీ దేవీ ఉపాసన



# శ్రీ భువనేశ్వరీ దేవీ ధ్యానం

శ్యామాంగీం శశిశేఖరాం నిజకరైర్ దధానంచ రక్తోత్పలం
రత్నాఢ్యం చషకం పరం భయహరం సంబిభ్రతీం శాశ్వతీం
ముక్తాహార లసత్పయోధర లతాం నేత్రత్రయోల్లాసినీం
వందేహం సురపూజితాం హరవధూం రక్తారవిందస్థితాం

ఉద్యద్దునిద్యుతిమిందుకిరీటాం
తుంగకుచాం నయనత్రయయుక్తాం
స్మేరముఖీం వరదాంకుశపాశాం
భీతికరాం ప్రభజే భువనేశీమ్

# గురువాణి

## విషయ సూచిక

**గురువాణి ఆధ్యాత్మిక మాస పత్రిక**
సంపుటి -2 సంచిక - 1, సెప్టెంబర్ 2023,
34 పేజీలు

**గురువాణి** డిజిటల్ తెలుగు మాస పత్రిక, శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్ వారిచే ముద్రించబడినది.

గురువాణి సమాచార పత్రికను అందరికీ షేర్ చేయడం, యూ ట్యూబ్ ఛానల్ మరియు ఫేస్ బుక్ పేజి లలో చేరడం ద్వారా పీఠం యొక్క కార్యక్రమాలలో మీరు భాగస్వాములు కావచ్చును.

Subscribe Newsletter | Follow on Facebook | Subscribe YouTube

©Srividya Learning Centre

**శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్**
(సౌందర్య లహరి యొక్క ఒక విభాగము)

#69, 6th Cross Street, Girinagar Phase I,
Bengaluru, K A 560085, India.

srimeru999@gmail.com

+91 8088256632

www.srimeru.org

**ఈ సంచికలో** — **పేజీ**

**కవర్ పేజీ చిత్రము**
శ్రీ భువనేశ్వరీ దేవీ

**ధ్యానం**
శ్రీ భువనేశ్వరీ దేవీ ధ్యానం — 02

**గురువాణి**
వర్తమానంలో జీవించడమే సాధన — 04

**అంతరార్థము**
శ్రీ దేవి ఖడ్గమాల ధ్యాన శ్లోకము — 06

**శ్రీ విద్యా జ్ఞాన పీఠము సమాచారం** — 09

**శ్రీవిద్యా సాధన**
శ్రీ భువనేశ్వరీ దేవీ ఉపాసన — 12

**శ్రీవిద్యా మందిరాలు**
శ్రీ దుర్గాభవానీ ఆలయం — 18

**నివారణోపాయములు**
అమ్మాయిలకు పెళ్లి కావడానికి — 21

**ప్రశ్నలు - సమాధానములు** — 24

**సాధకుల అనుభవాలు** — 26

**బాలల విభాగము** — 28

**రాబోయే కార్యక్రమాలు / జరిగిన కార్యక్రమలు** — 30

**కాల నిర్ణయ పట్టిక** — 32

**చివరి పేజీ చిత్రము**
దుర్గా దేవి




# వర్తమానంలో జీవించడమే సాధన

## శ్రీ గురు కరుణామయ

### శ్రీ మాత్రే నమః

మనం చాలా సార్లు, "ముక్తి చెందడం, విముక్తి చెందడం, ప్రాపంచిక విషయాలనుండి దరి చేర్చడం" ఇలాంటి మాటలు చాలా సార్లు వింటూ ఉంటాం. అయితే, "ముక్తి అంటే దాని కోసం చాలాగొప్ప ప్రయత్నం చెయ్యాలి. కొద్ది మందికి మాత్రమే అది లభిస్తుంది" అన్న నిరాశావాదం చాలా మందికి ఉండి ప్రయత్నమే చెయ్యకుండా వదిలేసిన సందర్భాలు కూడా చాలా ఉంటాయి. అసలు విషయం గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది.

మనం పుట్టినపుడు, అమ్మ గర్భంలో తొమ్మిది నెలలు బందీ గా ఉన్నా అమ్మ దయ వలన, భూమి మీద పడగానే విముక్తి చెందే పడ్డాము. పిండం లో నేను అన్న బుద్ధి వికసించడం కాని కల్మషం రావడానికి ఆస్కారమే లేదు. కనుక, తొమ్మిది నెలల బందీ నుండి విముక్తి చెందాము. భూమి మీద పడగానే మనల్ని మనమే బందీలుగా చేస్కుంటున్నాం అనే విషయం చాలా మందికి తెలీదు.

వయసు పెరిగేకొద్దీ మనం చదువు గురించిన ప్రణాళికలలో బందీ అయిపోతాం.

ఉద్యోగం కోసం దాని గురించి ప్రయత్నాలలో బందీ.
వృత్తి గురించి బందీ.
సంసారం లో డబ్బు సంపాదన లో బందీ.

పిల్లల మీద , కుటుంబాలో వ్యక్తుల మీద మితిమీరిన ప్రేమలో బందీ. ప్రేమ తప్పని ఎవరూ చెప్పరు. మితిమీరిన ప్రేమను మోహం అంటారు. ఆ ప్రేమకు కొంత పరిధి లేదా గిరి గీసుకోవాలి. చాలా మంది "నా బాధ్యత, నా బాధ్యత" అని విపరీత పోకడలకు పోయి ఆ భాద్యత మిషతో ప్రేమని మోహం గా మార్చుకొని ఇంకా "జీవితం అంతా పిల్లలే" అన్నట్టుగా చేసుకొని చివరికి ప్రాణం వదిలేటప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే తన జీవితం లో తాను ఉండడు. తనకి చోటే ఉండదు.అలా చేసుకొని నిష్ప్రయోజనంగా వెళ్ళిపోతారు.

స్వామి సత్యానంద సరస్వతి కుండలిని యోగ లో చెప్తారు "నీ చుట్టూరా ఒక గిరి గీస్కో ఆ గిరి దాటి ఎవ్వర్లు రావడానికి లేదు తల్లి తండ్రి భర్త భార్య పిల్లలు ఎందుకంటే నువ్వు జీవి మొట్ట మొదట జీవి నీకంటూ ఊపిరి పీల్చుకోడానికి ఒక కిటికీ ఉండాలి ఆ వలయం ఏంత విశాలంగా ఏంత దూరంగా ఉంటే అంత మనశాంతి మనకి ఈ వలయం నేర్పరితనంతో యోగమార్గంతో గీసుకోవాలి".

అందుచేత సంసారం లో బందీ అవడం కూడా మనమే చేసుకుంటున్నాము. అమ్మ ఏమి చెయ్యని అమాయకురాలు. అలా సృష్టి చేసి వదిలేసింది. తరువాత, నిరంతరం భవిష్యత్ గురించి ఆలోచించడం వల్లనే భవిష్యత్ ఏర్పడింది అని చెప్పబడుతోంది. ఎప్పుడయినా "ప్రస్తుతం లో ఉన్నామా?" అని మనలను మనం ప్రశ్నించుకోవాలి.

ఈ సమాచారం చదువుతూ కూడా, "పొయ్యి మీద కుక్కర్ పెట్టాను ఏమైపోతోందో!"

ఆ తర్వాత "ఆఫీస్ కి వెళ్ళాలి ఏమైపోతుందో!"
ఆఫీస్ కి వెళ్లి "ఇంట్లో ఏమైపోతుందో!"
ఇలా ఆలోచిస్తూనే ఉంటాము కదా!

ఈ మనసు, ఉన్న చోట ఉండకుండా లేనిచోట సంచరిస్తూ ఉంటుంది. భవిష్యత్ లో చరించాలనే ఎరుక వల్లే భవిష్యత్ ఏర్పడుతుంది. ఉన్నది వార్తమానమే. వార్తమానాన్ని గ్రహించగానే అది భూతం కింద మారిపోతుంది. ఎంత సున్నితంగా ఉంటుంది అంటే, ఉన్నది వార్తమానమే అని గ్రహించే సరికి, అది భూతం కింద మారిపోయి, మళ్ళీ వార్త మానం వస్తుంది.

అర్జునుడు చెట్టు మీద ఉన్న చిలక కంటి పాప నుండి దృష్టి మరల్చుకోకుండా దాని మీదనే మనసు నిలిపాడు. అలాగే వార్తమానం మీద దృష్టి ఉంచిన వాడికి భూతం భాధించదు. భవిష్యత్ భయపెట్టదు. వార్తమానమే సుఖమిస్తుంది.

శివుడు మూడో కన్ను తెరిచి మన్మధుడుని దహనం చేశాడు అంటారు. మన్మధుడు ఎవరు మనసుని మధించే వాడు. మనసుకు సంధానమై ఉన్నవి ఇంద్రియాలు. శివుని మూడు కళ్లు కాలానికి సంకేతాలు. కుడి కన్ను భూత కాలం, ఎడమ కన్ను భవిష్యత్ కాలం.మూడవ కన్ను వర్తమాన కాలం. కుడి కన్ను అనగా భూతకాలం ఎల్లప్పుడూ బాధిస్తూనే ఉంటుంది. ఎడమ కన్నేమో భవిష్యత్తు అది మాయ అదే శక్తి స్త్రీ . అదేప్పుడు భయపెడ్తూనే ఉంటుంది. ఎలా ఉంటుందో ఏమిటో అని మధ్యలో ఉన్న మూడో కన్నే వార్తమానం. ఎప్పుడయితే మూడో కన్ను అయిన వర్తమానం తెరిచి వర్తమానం లో ఉండటానికి జీవుడు ప్రవర్తిస్తాడో, అప్పుడు ఆ జీవుడు శివుడిగా మారతాడు. శివుడు అంటే ద్రష్ట. నేను అన్న భావం లేనివాడు.

అయితే, వర్తమానంలో ఉండటం అంటే, ఏ కర్మలు చేయకుండా ఉండమని కాదు. ఏ కర్మ లు చెయ్యలేరు కూడా ఉండలేరు. ఒక పది నిముషాలు ఉండండి అంటే ఏమి చెయ్యకుండా కూర్చోమంటే, కూర్చుంటాము కానీ, ఆలోచిస్తూ ఉంటాము. అనగా ఒక కర్మ చేస్తూ ఉంటాము. అందుచేత ఏమీ చెయ్యకుండా ఉండలేరు. కనుక, అన్ని కర్మలు చేయాలి. కానీ "నా చేత చేయించ పడుతోంది" అన్న తాదాత్మ్య భావం తో చేయాలి. అమ్మ వద్ద సర్వశ్వ శరణగతి పొంది ఈ తాదాత్మ్య భావంతో కర్మలు చేసినపుడు "నేను" అన్న భావం పోతుంది. "మనలను 'నేను' అనే రూపంలో బాధ పెట్టే మన్మధుడు దహించబడతాడు" అని ఇక్కడ అర్థం చేసుకోవాలి.

శ్రీ మాత్రే నమః

గురువాణి

అంతరార్థము





# శ్రీ దేవి ఖడ్గమాల

# ఖడ్గమాల ధ్యాన శ్లోకము

**(భాగము 1)**

## హ్రీంకారాసనగర్భితానలశిఖాం

'హ్రీం' అనేది బీజాక్షరం. మనం 'హ్రీమ్' అని ఉచ్చరించినప్పుడు, కంఠము వద్ద 'హకారము', అంగిలి వద్ద 'రకారము' మరియు పెదవి ప్రాంతం చుట్టూ 'ఈకారము' గా శబ్దం ప్రారంభమవుతుంది. హకారము తామసికము; రకారము రాజసికము; ఈకారము సాత్వికము. 'హ్రీం' అనే బీజ అక్షరాన్ని పఠించడం ద్వారా మనలో జ్ఞానాగ్నిని వెలిగించే శక్తి కలుగుతుంది. అది మన అహాన్ని దహిస్తుంది.

హ్రీం- బీజ అక్షరం ఈ అహంకారాన్ని దహించడంతో పాటు, చిదగ్ని కుండ సంభూత కూడా అవుతుంది. అంటే, మనము మన చిత్ (మనసు) ని అగ్ని కుండంగా చేసాము; మరియు మనము మన కోరికలన్నింటినీ, మన పూర్వజన్మ కల్పన లన్నింటినీ సమర్పించి, వాటిని ఆ కుండంలో కాల్చివేస్తాము. "మహాయాగ క్రమారాధ్యా, రహోయాగ క్రమారాధ్యా – మహా యాగం, రహో యాగం." ఈ ప్రక్రియ అంతా ఒక యాగం. ఈ హృదయమే అగ్ని కుండం. మన కోరిక ఆహుతి. ఆహుతి సమర్పించగా అక్కడ ఒక అందమైన అగ్ని పుడుతుంది. అదే చిదగ్ని కుండ సంభూత అయిన అమ్మ. అగ్ని పైన 'శిఖాం' - 'తస్య శిఖాయామ్' శిరస్సు పైన 10 అంగుళాలు అని సూచించబడింది; మనము కళ్ళు మూసుకుని ఈ భావనతో పారాయణం చేసినప్పుడు ఆ తల్లి అనే భావనను అనుభవించగలుగుతాము.

మన శ్వాస 'అనాహత చక్రం' నుండి వస్తోంది - అనాహత చక్రం అంటే విశ్వజనీన కరుణ ను సూచించే చక్రము. ఇది మనలను ప్రతి దానితో ఒకటి గా చేస్తుంది. మరియు హ్రీమ్ ను 'హృల్లేఖా బీజం', 'లక్ష్మీ బీజం' అని కూడా అంటారు. లక్ష్మి అంటే డబ్బు, బంగారము కాదు.. 'నేను చూస్తున్నదీ, నేనూ ఒకటే' అని తెలిస్తే అది లక్ష్మి.

మనము అగ్నిని రగిల్చి మన కోరికలన్నింటినీ కాల్చి వేస్తాము; అప్పుడు అగ్ని పైన, మనం తల్లిని అనుభూతి చెందగలము. ఇదొక అనుభవం. అందుకు మనం సంపాదించిన జ్ఞానమంతా ఉండకూడదు. ఆలోచన 'నాకు ఇది తెలుసు; నేను ఇది' - అనే ఈ అజ్ఞానపు గుర్తింపు తొలగాలి. అందువల్ల, మనకు బోధించకముందే ఆమె మీ తలని (కోరికని) కత్తిరించి వేస్తుంది.

## సౌః క్లీం కళాం బిభ్రతీం

సౌః అనేది పరా బీజం; క్లీం అపరా బీజమ్. సౌః ను సూర్య, జ్ఞానం మరియు చైతన్యం అని కూడా అంటారు. క్లీం అనేది చంద్రుడు, కరుణ మరియు వినయం, ప్రవాహాన్ని కూడా సూచిస్తుంది. కాబట్టి హ్రీం మన అహాన్ని కాల్చినప్పుడు, క్లీం దానిని ప్రవహింప చేస్తుంది. హకారము, కకారము - రెండూ అహంకారాలు. సౌః మన అహాన్ని కాల్చివేస్తుంది మరియు క్లీం దానిని ప్రవహింప చేస్తుంది. మన అహం నిలువక ప్రవహించినప్పుడు, మనలో కరుణ మేల్కొంటుంది. అప్పుడు మనము ఎటు చూసినా తల్లే. మనకు ఆ అనుభూతి ఉన్నప్పుడు, షరతులు లేని ప్రేమ హృదయం నుండి పుడుతుంది. మరియు క్లీమ్ ఉన్నప్పుడు, మనము సౌః ను అనుభవించగలము. సౌః అనేది పరా బీజము. ఇది ఏ సాధకుడైనా పొందగలిగే గొప్ప అనుభవం. సౌః మరియు క్లీం రెండూ ఆ తల్లి కళలు మరియు అవి ఆమె శక్తులు.

కనుక 'సౌః' అనుభూతిని పొందాలంటే, మనము ముందుగా క్లీమ్‌ను అనుభవించాలి. కృష్ణుడికి క్లీం కూడా బీజము. క్లీం కృష్ణాయ, గోవిందాయ, గోపీ జన వల్లభాయ స్వాహా ॥

క్లీమ్ పొందిన వాడు జ్ఞానము, చైతన్యము షరతులు లేని ప్రేమ కలిగి సర్వ సృష్టికి ఆదర్శవంతుడు ( రోల్ మోడల్ ) అవుతాడు - అలాంటి వారికి వారు మరియు వారు చూసే వారికి మధ్య ఎటువంటి తేడా కనిపించదు.

ధ్యాన శ్లోకం లోని మొదటి పంక్తి లోనే 'హ్రీం", "క్లీం" మరియు "సౌః" బీజాక్షరాలు ఉన్నాయి. అగ్ని యొక్క ఆ శిఖ ను అనుభవించే తేజస్సు (శిఖ అనగా పైభాగం) 'సౌః మరియు 'క్లీం కళలను కూడా అనుభవించేలా చేస్తుంది. ఆ సమయములో సాధకుడు తనకే తెలియకుండా కన్నీరు కారుస్తాడు.

తిరువణ్ణామలై, కాశీ, రామేశ్వరం, కాంచీపురం, శ్రీశైలం వంటి క్షేత్రాలలోని భగవంతుని నామాలు లేదా అద్భుతాలు విన్నప్పుడు ఎవరైనా కరిగి కన్నీరు కారుస్తారు. వారు 'క్లీమ్'ని అనుభవిస్తున్నప్పుడు ఆ నామము కన్నీళ్లను తెప్పిస్తుంది. 'క్లీం' బీజాక్షరం స్వయంచాలకంగా కన్నీళ్లు పెట్టేలా చేస్తుంది. ఒక్కసారి మన అహంకారాన్ని వదిలేస్తే, సూక్ష్మమైన అహం కూడా దహించుకు పోతున్ది. 'సౌః' బీజాక్షర శక్తి పైకి ప్రయాణించి విశ్వంలో కలిసిపోతుంది. అప్పుడు మనము విశ్వంతో ఒకటి అవుతాము. ఇలా జరిగితే మనలోని భయం పోతుంది. మా గురువుగారు 'పులిని చూసి ఎవరైనా ఎందుకు భయపడతారు?' అని అడిగేవారు. ఒకసారి మనం వాటిని మన వంటి జీవులుగా చూడటం ప్రారంభి స్తామో అప్పుడు మనం ఇక భయపడము. అందుకే చంటి పిల్లవాడు పులికి భయపడడు. అన్ని జీవులు ఒకే సార్వత్రిక శక్తిని పంచుకుంటాయి అనే ఏకత్వాన్ని అనుభవిస్తే, మనం ఇకపై పులికి భయపడము. 'సౌః' మనకు ఆ అనుభవాన్ని ఇస్తుంది.

'సౌః క్లీం కళాం బిభ్రతీం' . ఈ కళ మరో అందమైన పదం. ఈ అందం అనేది భౌతిక రూపం కాదు. రూపం (ప్రకాశం) యొక్క రూపురేఖల నుండి వచ్చే ప్రకాశం. ఆ తర్వాతి వరుసలో వచ్చే మెరుపు, తేజస్సు, 'వరసుధాం ధౌతం'. ప్రకాశమే అసలైన అందం. ఆ మెరుపు బంగారపు పసుపు రంగులో ఉంటుంది. ధ్యానం చేసినప్పుడు మన హృదయాన్ని యజ్ఞకుండగా ఊహించుకోవాలి. కేవలం బీజాక్షరం 'హ్రీం' అని ఉచ్చరించడం ద్వారా అగ్ని ప్రజ్వరిల్లుతుంది. మన కోరికలన్నీ ఈ అగ్నిలో కాలిపోయాయి మరియు ఒక వ్యక్తి సంపూర్ణమైన అనుభూతి చెందుతాడు.

**'పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా అవశిష్యతే ।**

ఈ సంపూర్ణత సంపూర్ణత నుండి వచ్చింది. నేను సంపూర్ణంగా ఉన్నాను, నేను ఏమీ చేయనవసరం లేదు అనే దశ. ఈ దశలో అందమైన అగ్ని 'ఆజ్ఞా చక్రం' వరకు విస్తరిస్తున్ది. శరీరం యొక్క కుడి వైపున 'సౌః' అనే అందమైన మెరుపు ఏర్పడుతుంది. హృదయాన్ని కలుపుతూ 'ఆజ్ఞా చక్రం' మరియు 'క్లీం' యొక్క మెరుపు ఎడమ వైపున ఏర్పడుతుంది. తద్వారా వృత్తం ఏర్పడుతుంది. 'సౌః' అనేది పురుష శక్తిని సూచించే 'చైతన్య లేదా సౌభాగ్య' బీజం మరియు 'క్లీం' అనేది కరుణ లేదా స్త్రీ శక్తి. 'సౌః చైతన్య స్వరూపం' మరియు 'క్లీం కరుణా రసార్ద్ర స్వరూపం' (షరతులు లేని ప్రేమ మరియు కరుణ).

నవావరణ పూజలో 'సౌః క్లీం' అని వర్ణించబడింది

**ఆర్ద్రం - జ్వలతీ జ్యోతిర్-అహమస్మి**
**జ్యోతిర్-జ్వలతి బ్రహ్మ-అహం-అస్మి**
**యోహం-అస్మి బ్రహ్మ-అహం-అస్మి**
**అహం-ఏవా-అహం మాం జుహోమి స్వాహా.**

ఇది చాలా అందమైన శ్లోకమ్. ఆర్ద్రం- క్లీం- (తేమ); జ్వలతి- సౌః (అగ్ని). అలా అమ్మవారి గురించి ఆలోచించిన ప్రతిసారీ ఏకీకరణ యొక్క అమృతాన్ని అనుభవిస్తాము.

(సశేషం)



# కాంచీపురం శ్రీవిద్యా జ్ఞాన పీఠం అప్‌డేట్

## ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులు

**సరిహద్దు రేఖ సర్వే**: శ్రీవిద్యా జ్ఞాన పీఠం సరిహద్దు రేఖ సర్వేను స్థానిక ప్రభుత్వ అధికారులు విజయవంతంగా నిర్వహించారు. మన పీఠం అభివృద్ధి ప్రక్రియలో ఈ ముఖ్యమైన దశ. మన భూమి విస్తీర్ణం మరియు దానిని మన రాబోయే ప్రాజెక్ట్‌ల కోసం ఎలా ఉపయోగించాలో పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

**కాంటూర్ సర్వే**: సరిహద్దు సర్వేతో పాటు సవివరమైన కాంటూర్ సర్వే కూడా పూర్తి చేశాం. ఈ రకమైన సర్వే మన భూమి యొక్క సహజ భూభాగం మరియు స్థలాకృతి గురించి అవసరమైన డేటాను అందిస్తుంది.

## జరుగుతున్న పనులు

**సైట్ డెవలప్‌మెంట్**: మనం ప్రస్తుతం సైట్ డెవలప్‌మెంట్ దశలో ఉన్నాము - ఇందులో ల్యాండ్ ఫిల్లింగ్ వంటి పనులు ఉన్నాయి. ఈ ప్రక్రియలో నిర్మాణం కోసం ల్యాండ్‌స్కేప్‌ని సరిదిద్దడం, భద్రత మరియు స్థిరత్వం కోసం అవసరమైన అన్ని నిబంధనలు మరియు ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం.

**బిల్డింగ్ అంచనాలు**: పీఠం పరిధిలోని వివిధ యూనిట్ల నిర్మాణానికి సంబంధించిన వివరణాత్మక అంచనాలను రూపొందించడంలో మేము చురుకుగా పని చేస్తున్నాము. ఈ అంచనాలు మెటీరియల్ ఖర్చులు, లేబర్, టైమ్ షెడ్యూల్‌లు మరియు మొత్తం బడ్జెట్ నుండి అన్ని అంశాలను కవర్ చేస్తాయి. సరైన ప్రాజెక్ట్ ప్రణాళిక మరియు ఆర్థిక నిర్వహణ కోసం ఈ కీలకమైన దశ అవసరం.

## పెండింగ్ పనులు:

**కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) ప్రాజెక్ట్ నివేదికలు**: కార్పొరేట్ దాతలకు అందించే సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను సిద్ధం చేసే ప్రక్రియలో ఉన్నాము. ఈ నివేదికలు మన ప్రాజెక్ట్‌ల స్వభావం మరియు కార్పొరేట్ సామాజిక బాధ్యత సూత్రాలకు అనుగుణంగా ఎలా ఉంటాయి అనే వివరాలను వివరిస్తాయి.

**CSR నిధులను పొందడంలో మనకు సహాయం చేయడానికి ఆసక్తి ఉన్న వారిని సంప్రదించవలసిందిగా మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము.**



# కాంచీపురంలో నిర్మించబడే శ్రీ విద్యా జ్ఞాన పీఠమునకు తోడ్పడండి!

**శ్రీ మాత్రే నమః**

అన్ని విద్యలలో కెల్లా గొప్పది శ్రీవిద్య అని చెప్పబడుతుంది. ఎందుకంటే, దీనిలో ప్రాపంచిక, ఆధ్యాత్మిక లక్ష్యాలను చేరుకునే పద్ధతులు, అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇటువంటి శ్రీవిద్యను అందరికీ నేర్పేవారు కరువైపోవడమే కాదు, ఆ విద్యను శాస్త్రబద్ధమైన రీతిలో ఉపాసన చేయడానికి అనువైన ప్రదేశాలు కూడా తగ్గిపోయాయి. ఏ ఉపాసన అయినా ఏదైనా క్షేత్రంలో చేస్తే ఫలితం ఎక్కువగా ఉంటుందని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

ఈ లోటును తీర్చడానికా అన్నట్లు సుప్రసిద్ధ శక్తి పీఠములలో ఒకటైన కాంచీపురంలో 9 ఎకరాల విస్తీర్ణంలో ప్రసిద్ధ శ్రీ విద్యా ఉపాసకులైన శ్రీ గురు కరుణామయ గారిచే ఒక శ్రీ విద్యా జ్ఞాన పీఠము నిర్మించబడుతున్నది.

ఇందులో, శ్రీ విద్య ప్రధాన దేవత అయిన రాజరాజేశ్వరి, సదాశివునిమీద ఆశీనురాలై, 9 అడుగుల ఎత్తు గల విగ్రహ రూపంలో భక్తులను అనుగ్రహిస్తుంది. అమ్మవారికి ఇరువైపులా 5 అడుగుల ఎత్తు గల విగ్రహ రూపంలో రాజశ్యామల, వారాహీ దేవతలు భక్తులలో ఆకర్షణ శక్తిని పెంచి, వారిని వ్యతిరేక శక్తులనుండి (నెగెటివ్ ఎనర్జీ) కాపాడుతూ ఉంటారు.

అంతే కాదు. సంప్రదాయ రీతులలో విశాలంగా నిర్మించబడే యాగశాలలో అన్ని రకాల హోమ గుండములు, నిర్మాణం చేయబడతాయి. వీటితోబాటు, ఒక పెద్ద గోశాల, రెండు పుష్కరిణులు, వాటి చుట్టూ ఉపాసకులు కూర్చుని ధ్యానం చేసుకోవడానికి వసతులు, చిత్రాలలో చూపించిన విధంగా నిర్మించబడతాయి.

నక్షత్రవనం, ఔషధ వనాలతో పాటు, శాస్త్రములలో చెప్పబడిన శ్రీ విద్యా సాధనకు సంబంధించిన అన్ని పుష్ప,ఫల, పత్ర వృక్షములు 3 ఎకరాల స్థలంలో పెంచబడతాయి. ఈ వనంలో నడిస్తే, అనేక ఆరోగ్య సమస్యలు తీరడజాలై కాకుండా, గ్రహ సంబంధమైన సమస్యలు కూడా పరిష్కరించబడతాయి అని నమ్మకము.

వీటన్నింటితో బాటు, ఆసక్తి గల సాధకులు శాశ్వతంగా ఉండి ఉపాసన చేసుకోవడానికి, లేదా సంవత్సరంలో కొంత కాలం ఉండడానికి వీలుగా ప్రత్యేక వసతి గృహాలు నిర్మించబడతాయి.

కావున, భక్తులెల్లరూ ఈ బృహత్సంకల్పానికి దోహదపడుతూ, శ్రీవిద్యా ఉపాసకులకు మాత్రమే కాకుండా, పామర జనానికి కూడా ఉపయోగ పడే ఈ అద్భుత పీఠ నిర్మాణానికి ఇతోధికంగా విరాళాలు అందించి సహాయ పడవలసిందిగా వినమ్రంగా అర్థిస్తున్నాము.



దాతలు దిగువ ఇవ్వ బడిన QR code ను scan చేసి, విరాళాలు శ్రీ విద్యా లెర్నింగ్ సెంటర్ యొక్క యాక్సిస్ బ్యాంక్ అకౌంట్ నందు జమచేయవచ్చును. మరిన్ని వివరములకు 8088256632, 9951998444, 8861858899 లలో ఏదైనా ఒక ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించగలరు.

డొనేషన్ ఇచ్చెడివారు వారివారి చిరునామా ఇచ్చినచో అమ్మవారి ప్రసాదము పంపించగలము





# శ్రీ భువనేశ్వరీ దేవీ ఉపాసన




# భూత, భవిష్యత్, వర్తమాన కాల జ్ఞానము పొందాలనుకునే వారు చేయవలసిన భువనేశ్వరీ దేవి ఉపాసన

భువనేశ్వరీ దేవి దశమహావిద్యలలో నాల్గవ విద్యకు అధిష్ఠాన దేవత. భాద్రపద శుక్ల పక్ష అష్టమి నాడు ఉద్భవమైనట్లు చెప్పబడినది. ఈవిడ ఉపాసన చేసేవారు సమస్త సిద్ధులను, సమస్త భోగాలను, భూత, భవిష్యత్, వర్తమాన కాలముల జ్ఞానమును పొందగలరు. ప్రత్యేకించి శ్రావణమాసంలో అమ్మవారిని భువనేశ్వరి రూపంలో ఉపాసన చేస్తే, పారమార్థిక, లౌకిక సాధనలలో విజయం సాధించవచ్చును.

భువనేశ్వరీ దేవి ఉపాసన చేసే వారు ముఖ్యంగా

- స్త్రీలను గౌరవించాలి.
- పరుష పదాలు ఉపయోగించకుండా, శాంతంగా వ్యవహరించాలి.

ప్రతి దేవత ఉపాసన లాగే, ఈ దేవతకు కూడా జపము, అర్చన, హోమము, తర్పణములు కలవు. కానీ ఏ మంత్ర సాధన ఐనా, కేవలము గ్రంథాలు చూసి చేస్తే ఫలించవు. గురు ముఖతః దీక్ష పొంది, వారి సూచనల ప్రకారం సాధన చేస్తే, దేవతానుగ్రహం కలుగుతుంది.

భువనేశ్వరీ మంత్రాన్ని పురశ్చరణ చేయాలంటే, శుద్ధ అష్టమి నుండి పూర్ణిమ వరకు తీవ్ర జపం చేస్తే, సత్వర ఫలితం లభిస్తుంది. ఇది ఒక పుణ్య క్షేత్రం, ఒక నదీ తీరం, ఒక పర్వతాగ్రం, సాగర సంగమాలు, పవిత్ర వనాలు, బిల్వ వృక్ష మూలము, దేవాలయములు, స్వగృహము ల యందు చేయవచ్చును. దశమహావిద్యలకు కొలువైయున్న కామాఖ్యా పీఠంలో సాధన చేస్తే, అత్యంత త్వరగా భువనేశ్వరీ అనుగ్రహం లభిస్తుంది.

ఇక, ఏ సాధనకైనా ముఖ్యం ఆసన శుద్ధి. భువనేశ్వరీ దేవి యొక్క శక్తి ఎరుపు రంగులో అత్యధికంగా ఉంటుంది కాబట్టి, ఈ రంగులో ఉన్న ఆసనం మంచిది. దర్భాసనం మీద ఎరుపు రంగు గల చిత్రాసనాన్ని వేసుకుని, ఉపాసన చేస్తే చాలా మంచిది. క్రింద కూర్చోలేని వారు కుర్చీలో ఆసనం వేసుకుని కూర్చొనవచ్చును. ఎరుపు రంగు వస్త్రములు కట్టుకుంటే మరింత శక్తిని పొందుతారు. తూర్పు లేక ఉత్తరం దిక్కుగా కూర్చుని జపం చేస్తే ఫలితం ఎక్కువ. 10, 20, 40 రోజులలో ఏదో ఒక పరిమితి పెట్టుకుని, లక్ష జపం చేయాలి.

అన్ని పూజలకు ఉండేటట్లు జపానికి కూడా, గురుధ్యానం, గణపతి ధ్యానం, ఆచమనం, ప్రాణాయామం, సంకల్పం

ఉంటాయి. ఇవి ఇంతకుముందు సంచికలలో చెప్పాము కాబట్టి మళ్లీ చెబితే, చర్విత చర్వణం అవుతుంది కాబట్టి ఇక్కడ చెప్పటం లేదు. సంకల్పంలో భువనేశ్వరీ పరదేవతా ప్రీత్యర్థం పురశ్చరణ పూర్వక భువనేశ్వరీ మంత్రజపం కరిష్యే – అని మొదలుపెట్టి, భువనేశ్వరీ మంత్రాన్ని జపించాలి.

భువనేశ్వరీ మంత్రం

హ్రీం

ఈ మంత్రం పలుకుతున్నప్పుడు హ్రీం అని దీర్ఘ స్వరంతో పలుకుతూ, చివరనున్న నాదాన్ని అనుభవించాలి. ఇలా చేసినప్పుడు కొంత సమయానికి మీరు మంత్ర జప స్థితిని దాటి, అలౌకిక స్థితికి వెళ్లిపోతారు. అయినా ఫరవాలేదు. నాదము మణిపూరము అనగా నాభిస్థానము వద్ద మొదలై, ఆజ్ఞా చక్రం నుండి బయటకు వచ్చి, మళ్లీ మూలాధారం గుండా మణిపూరం దగ్గర అంతమవ్వాలి.

జప సంఖ్య విషయానికి వస్తే, ఇలా చేసినప్పుడు ఒక నిముషానికి 30 సార్లు జపం చేయడం అవుతుంది. అనగా గంటకు 1800 సార్లు జపం అవుతుంది. ఎందుకైనా మంచిదని దానిని 1500 సార్లు గా మాత్రమే లెక్క పెట్టుకోవాలి. అలారం పెట్టుకుని, ఒకటి లేదా రెండు గంటలు (ఎంత వీలైతే అంత) చేస్తే, జప సంఖ్యను లెక్క పెట్టవలసిన అవసరం లేదు.

సంకల్పం తరువాత, క్రింది ఋషి, ఛందస్సు, బీజము, శక్తి, కీలకము వివరాలను పఠించాలి.
అస్య శ్రీ భువనేశ్వరీ ఏకాక్షరీ మంత్రస్య.

శక్తి ఋషిః, గాయత్రీ ఛందః, హకారో బీజం, ఈకార శక్తిః, రేఫ కీలకం, శ్రీ భువనేశ్వరీ దేవతా ప్రీత్యర్థం జపే వినియోగః

ఋషానాది న్యాసం

శక్తి ఋషయే నమః శిరసి
గాయత్రీ ఛందసే నమః ముఖే
భువనేశ్వరీ దేవతాయై నమః హృది
హం బీజాయ నమః గుహ్యే
ఈం శక్తయే నమః పాదయోః
రం కీలకాయై నమః నాభౌః
వినియోగః సర్వాంగే

కరన్యాసం

ఓం హ్రాం అంగుష్ఠాభ్యాం నమః
ఓం హ్రీం తర్జనీభ్యాం నమః
ఓం హ్రూం మధ్యమాభ్యాం నమః
ఓం హ్రైం అనామికాభ్యాం నమః
ఓం హ్రౌం కనిష్టికాభ్యాం నమః
ఓం హ్రః కరతల కర పృష్ఠాభ్యాం నమః

అంగన్యాసం
ఓం హ్రాం హృదయాయై నమః

ఓం హ్రీం శిరసే స్వాహా
ఓం హ్రూం శిఖాయైవషట్
ఓం హ్రైం కవచాయహుం
ఓం హ్రౌం నేత్రత్రయాయ వౌషట్
ఓం హ్రః అస్త్రాయ ఫట్
భూర్భువస్సువరోమితి దిగ్బంధః

ధ్యానం

ఉద్యద్దినద్యుతిమిందు కిరీటాం తుంగకుచాం నయనత్రయయుక్తాం
స్మేర ముఖీం వరదాంకుశ పాశాభీతికరాం ప్రభజే భువనేశ్వరీం

అథ పంచపూజాం కుర్యాత్

లం పృథివీ తత్వాత్మికాయై శ్రీ భువనేశ్వరీ పర దేవతాయై గంధం దారయామి
(అమ్మవారి విగ్రహం లేదా యంత్రానికి గంధం పూయాలి)
హం ఆకాశ తత్వాత్మికాయై శ్రీ భువనేశ్వరీ పర దేవతాయై పుష్పం సమర్పయామి
(అమ్మవారి విగ్రహం లేదా యంత్రానికి పుష్పం సమర్పించాలి)
యం వాయు తత్వాత్మికాయై శ్రీ భువనేశ్వరీ పర దేవతాయై ధూపమాఘ్రాపయామి
(అమ్మవారి విగ్రహం లేదా యంత్రానికి ధూపం చూపించాలి)
రం తేజస్త్వత్వాత్మికాయై శ్రీ భువనేశ్వరీ పర దేవతాయై దీపం దర్శయామి
(అమ్మవారి విగ్రహం లేదా యంత్రానికి దీపం చూపించాలి)
వం అమృత తత్వాత్మికాయై శ్రీ భువనేశ్వరీ పర దేవతాయై నైవేద్యం సమర్పయామి.
(అమ్మవారి విగ్రహం లేదా యంత్రానికి నైవేద్యం సమర్పించాలి. పండ్లు, మినప సున్నుండలు నైవేద్యముగా పెట్టవలెను)
అని పంచోపచారములు చేయవలెను.

తరువాత జపం ప్రారంభించవలెను.

ప్రతి రోజూ జపం చేసిన తరువాత, మరల మూడు సార్లు ఆచమనం చేసి, కుడి చేతిలో నీళ్లు తీసుకుని,
"అనేన మయాకృతేన శ్రీ భువనేశ్వరీ పర దేవతా మంత్ర జపేన శ్రీ భువనేశ్వరీ పరదేవతా సుప్రీతా సుప్రసన్నా వరదాభవతు. శ్రీ భువనేశ్వరీ పరదేవతా సంపూర్ణ కటాక్ష సిద్ధ్యర్థం ఏతత్ జప ఫలం శ్రీ భువనేశ్వరీ పరదేవతా చరణారవిందార్పణమస్తు".

అని చెబుతూ, చేతిలోని నీటిని పళ్లెంలో వదలాలి. అలా వదిలిన నీటిని తీర్థంలా స్వీకరించాలి. ప్రతి రోజూ ఈ విధంగా జపం చేయాలి.

పై విధంగా జపం చేస్తే, వ్యతిరేక శక్తుల నుండి విముక్తి పొంది, శాశ్వతమైన సుఖ సంతోష భోగములను ఉపాసకులు పొందుతారు.

పూర్తి ఫలితానికి భువనేశ్వరీ మంత్రాన్ని 32 లక్షల జపం చేయాలి.

ఈ జపాన్ని ముందుగా, 40 రోజులు అని గానీ, 90 రోజులు అని గానీ, ఎంతో కొంత కాలం నిర్దేశించుకుని, ఆ వ్యవధిలోపల జపం పూర్తి చేయడం మన దృఢ సంకల్పానికి చిహ్నం.

హోమం

జప సంఖ్యలో దశాంశం అనగా 10 వేలు(1 లక్షలో దశాంశం) గానీ, 3 లక్షల 20 వేలు(32 లక్షలలో దశాంశం) గానీ ఆహుతులు సమర్పిస్తూ హోమం చేయాలి. హోమంలో ఆహుతులుగా అష్ట ద్రవ్యములను తేనె, పంచదార, పాలతో కలిపి ఉపయోగించవలెను.

అష్ట ద్రవ్యములు

- ఆవు నెయ్యి
- నువ్వుల నూనె
- నువ్వులు
- బియ్యము లేదా వడ్లు
- బెల్లము
- ఎరుపు రంగు పళ్ల ముక్కలు
- పసుపు మరియు కుంకుమ కలిపిన అక్షతలు
- ఐశ్వర్యం కోసం చేసేటప్పుడు, వీటితో పాటు తామర పూలు, తామర గింజలు , కలువ పూలు, మారేడు దళములు – వీటిలో ఏదైనా ఉపయోగించాలి.
- వివాహం కోసం చేసేటప్పుడు, పసుపు, జీలకర్ర, బెల్లము, పేలాలు, పైన వివరించిన అష్ట ద్రవ్యాలతో కలిపి ఉపయోగించాలి.
- సంతానం కోసం చేసేటప్పుడు, తామర గింజలు, మామిడి పండ్ల ముక్కలు లేదా మామిడి తాండ్ర ముక్కలు, వెన్న ,మినప సున్ని, గారె ముక్కలు అష్ట ద్రవ్యములతో పాటు ఉపయోగించాలి.

హోమం పూర్తి అయిన తరువాత పూర్ణాహుతి ముందు కూష్మాండ (గుమ్మడి కాయ కు ) బలి ఇవ్వవలెను. చిన్న గుమ్మడి కాయకు కుంకుమ రాసి, పంచోపచారములు(గంధ, పుష్ప, ధూప, దీప, నైవేద్యములు) చేసి, భువనేశ్వరీ మూలమంత్రమైన హ్రీం అనే మంత్రాన్ని జపిస్తూ, మూడుసార్లు ప్రదక్షిణంగాను, మూడు సార్లు అప్రదక్షిణంగాను తిప్పి, తరువాత, ఆ గుమ్మడి కాయను నేలమీద పగలకొట్టి, ఆ ముక్కలను హోమగుండంలో వేయాలి.
ఏ హోమానికైనా, మామిడి, రావి సమిధలు శ్రేష్ఠము.

తర్పణములు

హోమ ఆహూతుల సంఖ్యలో దశాంశం 1000 సార్లు(1లక్ష జపానికి) లేదా 32,000 (32 లక్షల జపానికి) సార్లు తర్పణాలు చేయాలి.

తర్పణాలు నేరుగా యంత్రానికి లేదా పసుపుతో చేసిన గౌరీ దేవిని యంత్రము మీద ఉంచి చేయవచ్చును.

గంధము, అక్షతలు, పాలు కలిపిన జలం తర్పణాలకు వినియోగించాలి.

"హ్రీం తర్పయామి నమః" అనే మంత్రముతో తర్పణాలు చేయవలెను.

ధ్యాన శ్లోకం

శ్యామాంగీం శశిశేఖరాం నిజకరైర్ దధానంచ రక్తోత్పలం
రత్నాఢ్యం చషకం పరం భయహరం సంబిభ్రతీం శాశ్వతీం
ముక్తాహార లసత్పయోధర లతాం నేత్రత్రయోల్లాసినీం
వందేహం సురపూజితాం హరవధూం రక్తారవిందస్థితాం

**అర్చనలో భువనేశ్వరీ అష్టోత్తరం** (వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోచ్చు).



# శ్రీ దుర్గాభవానీ ఆలయం

ధనకొండ, మొగల్రాజపురం, విజయవాడ

సంపుటి 2 - సంచిక 1



# ధనకొండ పైన గుహలో కొలువై ఉన్న దుర్గమ్మ

విజయవాడ అనగానే మన అందరికీ స్పురణకి వచ్చేది ఇంద్రకీలాద్రి పైన కొలువై ఉన్న కనక దుర్గమ్మ. కానీ అదే విజయవాడలో మొగల్రాజ పురంలోని ధనకొండ పైన గుహలో కొలువై ఉన్న దుర్గమ్మ గురించి కొందరికి మాత్రమే తెలిసి ఉండవచ్చును. ఈ దుర్గమ్మ స్వయంభూ గా వెలిశారని అంటారు. ఇంద్రకీలాద్రి కంటే ముందే అమ్మవారు ఈ ధనకొండ పైన వెలిసిందని చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

ఒకప్పుడు మొగల్ రాజు నివాసమున్న ప్రదేశమైన మొగల్ రాజపురం ప్రాంతంలో కొండ మీద ఉన్న శ్రీ దుర్గాభవానీ ఆలయంలో అమ్మ వారు స్వయంభూ గా వెలిశారు. ఇంద్రకీలాద్రి మీద కనక దుర్గ అమ్మవారే ఈ అమ్మవారు . కానీ, ఇంద్రకీలాద్రి మీద అమ్మవారు వెలయడానికి ముందే ఇక్కడ అమ్మవారు ఉన్నట్లు కొన్ని గాధలు ఉన్నాయి. “దక్షిణాన వెలిసిందిరా! మాయమ్మ ఉత్తరానికొచ్చిందిరా!” అంటూ ఇక్కడి గ్రామ ప్రజలు పాడుకునే పల్లె పదాలు ఈ విషయానికి ఆధారాలు. ఒక గొర్రెల కాపరి ప్రతీ రోజు తన గొర్రెలను మేపటానికి ఈ కొండకు వచ్చేవాడు. ఒక రోజు యధావిధిగా ఆ కొండ పైకి గొర్రెలను తీసుకుని వెళ్ళాడు, అప్పుడు అతనికి అక్కడ గజ్జెల శబ్ధం వినిపించింది. ఆ శబ్ధం వస్తున్న వైపుగా వెళితే అక్కడ అతనికి ఒక స్త్రీ కనిపించి నీకు మూడు బస్తాల బంగారం ఇస్తాను, వెనక్కి చూడకుండా వెళ్ళు, వెనక్కి తిరిగావో నీవు శిలగా మారిపోతావు అని చెప్పింది. ఆ గొర్రెల కాపరి వెనక్కి తిరగకుండా కొంత దూరం వెళ్ళి మూడవ మలుపు వద్ద వెనక్కి చూడగానే అమ్మవారు అంతర్ధానం అయిపోయింది. మరుక్షణమే అతను ఒక శిలగా మారిపోతాడు. ఆ గొల్లవాడు శిలగా మారిన చోట ఉన్న శిల మిగిలిన కొండరాళ్ల కన్నా వైవిధ్యంగా కనపడుతుంది. దానిని గొల్ల బండ అని అంటారు.

షుమారు 200 సంవత్సరాలనుండి ఇక్కడి అమ్మవారికి పూజలు జరుగుతూ ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అప్పటిలో పూజారులు కూడా, ఎటువంటి దారి లేని ఈ ప్రదేశానికి, చెట్లు, పుట్టలు పట్టుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి అమ్మవారికి పూజలు చేసేవారట. ఇప్పుడు గుడి కోసం ఒక ప్రబంధనా సమితి ఏర్పడి, పైకి వెళ్లడానికి మెట్లు ఏర్పాటు చేయించారు. కానీ, ఎవరైనా మెట్లు ఎక్కి వెళ్లే దారి తప్ప మరొక దారి లేదు.

ప్రతి సంవత్సరం నవరాత్రులలో ఇక్కడ జాతరలు జరుగుతాయి. క్రింద నుండి నైవేద్యాలు విశేషంగా చేసి, కొండమీదకు తెచ్చి నైవేద్యం సమర్పించుకుంటారు. ఈ చుట్టు పక్కల ప్రజలందరూ అమ్మను తమ ఇలవేల్పుగా కొలుస్తారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా స్థానికులు ఏడు అడుగుల ఎత్తులో ఉండే అమ్మవారి విగ్రహాలు రెండింటిని ఇక్కడ ప్రతిష్ఠ చేయించారు. అమ్మవారు పగటి పూట అంతా ఇంద్ర కీలాద్రి మీద ఉండి, రాత్రి సమయంలో ఈ గుడికి వస్తుంది. రాత్రి అంతా ఇక్కడే కొండ మీద తిరుగుతూ ఉంటుంది. ఇప్పటికీ, రాత్రి సమయాలలో కొండమీద నుండి గజ్జెల శబ్దం వినబడుతూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఈ ఆలయంలో అమ్మవారి విగ్రహ రూపం ఉండదు. ఈ అమ్మవారు ఉగ్రరూపిణి. కొండ పైభాగంలో వెలసి ఉన్న అమ్మవా రూపం ఎవరికీ కనపడదు. గర్భాలయంలో మాత్రం ఎర్రటి జ్వాలలాగా ఒక రూపం కనిపిస్తుంది. ఈ రూపం క్రింది భాగంలో శ్రీ చక్ర రూపం ఉంటుంది. అమ్మవారి రెండు పాదములు ఉంటాయి.

పక్కనుండి ఏర్పరచిన నిలువు మెట్లు ఎక్కి పైకి వెళితే, అక్కడ శివలింగం దర్శనం ఇస్తుంది. అయితే, అమ్మవారు క్రింద ఉన్న కొండరాయి మీదనే, పైన శివలింగం చెక్కి ఉండడం ఇక్కడి విశేషం.



నదీ స్నానమాచరించి, ఈ కొండ మీదకు వచ్చి, అమ్మను దర్శించుకోవడానికి భక్తులు ఎన్నో ఆటంకాలు ఎదుర్కోవడమేకాక, పవిత్ర స్నానమాచరించి కూడా ఫలితం దక్కటం లేదని బాధలు పడుతున్న కారణంగా, జ్వాలా రూపంలో ఉన్న అమ్మవారు ఇంద్రకీలాద్రి కొండ మీద కనకదుర్గ రూపంలో వెలసింది అని చెప్పడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ రూపం క్రింది భాగంలో శ్రీ చక్ర రూపం ఉంటుంది.

అమ్మవారి రెండు పాదములు ఉంటాయి. పక్కనుండి ఏర్పరచిన నిలువు మెట్లు ఎక్కి పైకి వెళితే, అక్కడ శివలింగం దర్శనం ఇస్తుంది.

అయితే, అమ్మవారు క్రింద ఉన్న కొండరాయి మీదనే, పైన శివలింగం చెక్కి ఉండడం ఇక్కడి విశేషం. నదీ స్నానమాచరించి, ఈ కొండ మీదకు వచ్చి, అమ్మను దర్శించుకోవడానికి భక్తులు ఎన్నో ఆటంకాలు ఎదుర్కోవడమేకాక, పవిత్ర స్నానమాచరించి కూడా ఫలితం దక్కటం లేదని బాధలు పడుతున్న కారణంగా, జ్వాలా రూపంలో ఉన్న అమ్మవారు ఇంద్రకీలాద్రి కొండ మీద కనకదుర్గ రూపంలో వెలసింది అని చెప్పడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

తిరుమలేశుని సన్నిధానానికి వెళ్లాలంటే ఎలా వంపులు తిరుగుతూ వెళ్లాలో, అలాగే ఇక్కడ ఎనిమిది వంపులు తిరిగిన తరువాత, తొమ్మిదవ వంపులో అమ్మవారి సన్నిధానానికి చేరగలుగుతాము.

పెళ్లి కానివారు ఇక్కడకు వచ్చి పూజా కార్యక్రమాలు జరిపించుకుని వెళ్లిన సంవత్సరంలోపు వివాహం జరగడం, వాహనాల రంగంలో డ్రైవర్లుగా, ఇతర పనులలో ఉన్నవారిలో, ధనకొండ అమ్మను నమ్ముకున్నవారికి ఏమాత్రం ప్రమాదాలు జరగకుండా ఉండడం వంటి నిదర్శనాలు కనబడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

కొండ ఎక్కే సమయంలో కానీ, దిగే సమయంలో కానీ శరీరం మొత్తం భారాన్ని కాళ్లమీద వేసి ఎక్కడం సహజం. అయితే, కొంతదూరం ఎక్కేసరికి, మూడవ మలుపు దగ్గర నుండి అలసట, కాళ్ల నొప్పులు అనిపించవు. వయసు మళ్లిన వారు కూడా అలవోకగా ఈ ఆలయ సందర్శనం కోసం కొండ మెట్లు ఎక్కి వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

ఈ అమ్మవారిని పూజిస్తే, సకల సిరి సంపదలు కూడుతాయని విశ్వాసము. అమ్మవారు ధనాన్ని ప్రసాదిస్తారు కనుక ఈ కొండకు అప్పటినుండి ధనకొండ అని పేరు వచ్చింది.

ఇక్కడ, ప్రతి శుక్రవారము, ప్రతి ఆదివారము ప్రత్యేక పూజల తోబాటు అన్న సంతర్పణం కూడా జరుగుతున్నది. దర్శనార్థం వచ్చిన మాతృమూర్తులకు అమ్మవారికి సమర్పించిన గాజులు ఇవ్వడం కూడా ఇక్కడి విశేషం.



# అమ్మాయిలకు పెళ్లి కావడానికి చేయవలసిన పూజా విధానములు

ఎవరికైనా, పెళ్లి కావడం లేదంటే, రెండు కారణాలు ఉంటాయి. ఒకటి సంబంధాలు రాకపోవడం, రెండు సంబంధాలు కుదరకపోవడం. మొదటి కారణమైతే దిగువనిచ్చినటువంటి పూజా విధానములు సత్ఫలితాలను ఇస్తాయి. కానీ, రెండవ కారణమైతే, ఈ పూజా విధానం ఆచరించడానికి ముందు పాటించవలసిన విషయాలు ఉన్నాయి.

ఏ వివాహమైనా సరే, జగన్మాత సంకల్పం చేత మాత్రమే జరుగుతుంది అని అందరూ నమ్మాలి. కానీ, అమ్మాయి వివాహ వయస్సులో ఉన్నప్పుడు జాతకాలు మొదలైన కొన్ని కారణాల వల్ల సంబంధాలు వద్దనుకోవడం జరుగుతున్నది. జాతకాలు చూడవద్దు అని చెప్పడం లేదు కానీ, అదే పనిగా జాతకాలనే నమ్ముకుని, మంచి సంబంధాలు వద్దనుకోవడం అంత మంచి పని కాదు. ఎందుకంటే, ఈ కలియుగంలో వివాహ బంధం కేవలము జాతక పొంతనల మీద మాత్రమే కాక, వధూవరుల మానసిక పరివర్తన, పరిస్థితులకు సర్దుకుపోయే గుణం - ఇటువంటి అనేక విషయాలమీద ఆధారపడి ఉండగా, కేవలం ఒక్క జాతకాన్నే పట్టుకుని, సంబంధాలు వదులుకోకూడదు. అలాగైతే, జాతకాలు అన్నీ క్షుణ్ణంగా పరిశీలించి చేసిన పెళ్లిళ్లు ఎన్నోవిఫలమవడం మనం చూస్తూ ఉన్నాము. అందువలన, వివాహం చేసుకోవలసిన ఆడపిల్ల గానీ, మగపిల్లవాడు గానీ, వివాహ బంధంలోని వారివారి బాధ్యతలను గుర్తు చేయవలసిన అవసరం తలిదండ్రులకు ఎంతైనా ఉన్నది.

- వివాహానికి పరిష్కార మార్గంగా అనేక పద్ధతులు ఉన్నప్పటికీ, నిశ్చయంగా ఫలితాన్నిచ్చేది సంపుటీకరణ చేసిన లలితా సహస్రనామ పూజ. అది ఎలాగంటే, లలితా సహస్ర నామంలో కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా అన్న వాక్యముతో లలితా సహస్రనామంలోని ప్రతి వాక్యాన్నీ సంపుటీకరణం చేయాలి.

**ఉదాహరణకు**

కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా
శ్రీమాతా మహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ
కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా
కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా
చిదగ్నికుండ సంభూతా దేవకార్య సముద్యతా
కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా .......

కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా

శ్రీ శివా శివ శక్త్యైక రూపిణీ లలితాంబికా
కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా

అని లలితా సహస్రనామాన్ని చదువుతూ, అమ్మవారి విగ్రహానికి గానీ, శ్రీ చక్రానికి గానీ, ఫొటోకు గానీ, కుంకుమ పూజ ప్రతి రోజూ ఒకో ప్రదేశంలో ఒకే సమయంలో వివాహం కావలసిన అమ్మాయి చేత చేయించి, ఆ కుంకుమను, ఆ అమ్మాయిని నుదుట పెట్టుకోమని చెప్పాలి. ఇలా 90 రోజులు చేయాలి.

2. ఒక్కొక్కప్పుడు వివాహం కాకపోవడానికి, సర్పదోషము అనే దోషం కారణం కావచ్చును. అదే అయినప్పుడు, దానికి పరిష్కారం ఈ విధంగా ఉంటుంది.

ప్రతి మంగళవారం రాహుకాల సమయంలో అనగా, సాయంత్రం 3 నుండి 4.30 గంటల లోపు, దుర్గాదేవికి యుధిష్టిర కృత దుర్గా స్తవం పఠిస్తూ, దానితోపాటు, వీలైతే, సర్ప సూక్తము కూడా పఠిస్తూ, పాలతో అభిషేకం చేయాలి. తరువాత, దకార దుర్గ అష్టోత్తర శత నామంతో ఎరుపు రంగు పుష్పాలతో పూజ చేసి, తొమ్మిది నిమ్మకాయ డిప్పలు (రసం పిండేసి తిరగేసి) తీసుకుని, వాటిలో ఎర్ర రంగు వత్తులతో నేతి దీపాలను వెలిగించి, ఆ దీపాలను అమ్మవారికి చూపిస్తూ మానసా దేవి స్తోత్రం చదవాలి.

తరువాత, ఎర్రని పండ్లు లేదా పండ్ల ముక్కలు, చిత్రాన్నము కానీ నైవేద్యముగా సమర్పించాలి. ఇలా 16 ఉపచారాల పూజ 9 మంగళవారాలు చేయాలి.

3. ఇది కాకుండా, స్వయంవర కల్యాణి మంత్ర జపం కూడా చాలా మంచి ఫలితాన్నిస్తుంది.

"**ఓం హ్రీం యోగిని యోగిని యోగేశ్వరి యోగేశ్వరి యోగాభయంకరి సకల స్థావర జంగమస్య ముఖం హృదయం మమ వశమాకర్షయ స్వాహా**"
పై మంత్రాన్ని గురుముఖంగా దీక్ష పొంది ఉపాసన చేస్తే పూర్తి ఫలితాలను పొందవచ్చును.

4. కొన్ని సమయాలలో రాజశ్యామలా మంత్రం కూడా సత్ఫలితాలను ఇస్తుంది.

5. నిత్య పూజ చేసేటప్పుడు, షోడశోపచారాలలో ఓం దుం దుర్గాయైనమః ధ్యాయామి, ఓం దుం దుర్గాయైనమః ఆవాహయామి,.....ఇలాగ ప్రతి ఉపచారమునకు దుర్గా మంత్రమును జోడించి పూజ చేయవలెను.
........

అదృష్టవశాత్తూ మధ్యలోనే వివాహం కుదిరితే, వివాహం పూర్తి అయ్యే వరకూ ఈ పరిష్కారాన్ని కొనసాగించి, తరువాత ఆపివేయవచ్చును.

- **సర్పసూక్తం** (వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోచ్చు)
- **ధర్మరాజ కృత దుర్గా స్తవం** (వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోచ్చు)
- **మానసా దేవి ద్వాదశ నామ స్తోత్రమ్** (వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోచ్చు)
- **దకారాది శ్రీ దుర్గా అష్టోత్తర శత నామావళి** (వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోచ్చు).



గురువాణి
ప్రశ్నలు - సమాధానములు
సంపుటి 2 - సంచిక 1

# ఒక్కసారి కొండెక్కిన దీపం నూనె మళ్ళీ ఉపయోగించవచ్చా?

ఇంట్లో దీపారాధన చేస్తున్న సమయంలో, కొన్ని సందర్భాల్లో అనుకోకుండా దీపం అనేది కొండెక్కడం జరుగుతుంటుంది. అలాంటి సందర్భంలో, అందులో నూనె గాని, వత్తి గాని ఉంటుంది. సాయంత్రం వేల మళ్ళీ పూజ చేసే సమయం లో, చాలా సందర్భాల్లో మనం నూనె / వత్తి ఉంది కదా అని చెప్పి మళ్ళీ దాన్ని తీసి మళ్ళీ వెలిగించి, పూజ చేస్తుంటాం. మరి అలా చేయ వచ్చునా?

అనుమానం వల్ల ఎంత సేపు ఇక్కడ మన దృష్టి, నూనె మీద, వత్తి మీద ఉంది తప్పితే, ఈ దీపం వెనకాల ఉన్న తత్వం మీద లేదు. మనకి చాలా అనుమానాలు ఉన్నాయి. రెండు వొత్తులు వేయాలి , మూడు వొత్తులు వేయాలి , ఒక వత్తి వేయకూడదు. ఏ నూనె వాడాలి? కొబ్బరి నూనా, నువ్వుల నూనా? నెయ్యి.. ఇలాగ మనం చాలా సందిగ్ధంలో పడుతుంటాం. దీపం వెలిగించే అప్పుడు మనం దాని వెనకాల ఉన్న తత్వం గ్రహించినప్పుడు మనకు ఈ అనుమానం రాదు. "అగ్నిమీళే పురోహితం ", అని 'ఋగ్వేదంలో' మొట్ట మొదటి రుక్కు. 'ప్రతీది అగ్ని తో మొదలు అవుతుంది' అని దీని అర్థము. అగ్ని అంటే "చైతన్యం".

మనం ఈ జీవితంలోకి రావడానికి మన తల్లిదండ్రులకి 'కామాగ్ని' ముఖ్యం (వాళ్ళ కోరిక). మనం ఈ జీవితంలోకి వచ్చినాక బ్రతికి నిలవడానికి మన కడుపులో ఉన్న 'జఠరాగ్ని' ముఖ్యం (digestive fire). శరీరం లో నుండి జీవం వొదిలి వెళ్ళిపోయాక, మన శరీరాన్ని పంచ భూతాల్లో కలిపేయడానికి 'చితాగ్ని' ముఖ్యం. ఎక్కడ చూసినా 'అగ్ని' ఏ వస్తుంది. అగ్ని లేకుండా మనం లేము.

అందువల్ల మనం పూజ చేసే అప్పుడు మొట్ట మొదట అగ్ని ని వెలిగిస్తూ ఉంటాం 'దీపం' రూపం లో. దాంట్లో నూనె ఉందా? వత్తి పాతదా? కొత్తదా? అన్నది ముఖ్యం కాదు. ఈ వత్తులు, నూనె, ఉపకరణాలు అన్ని ఉపాధులు మాత్రమే. అసలు దీపమే ఒక ఉపాధి. ఈ ఉపాధి ద్వారా "నాకు జీవితంలో ముఖ్యమైనది అగ్ని" అని మనం గ్రహించవవలసి ఉన్నది.

## ఎందుకు అగ్ని ముఖ్యం?

ఉదయంగాని, సాయంకాలం గాని, ఏ సమయం లో అయినా దీపం వెలిగించడం లో తప్పు లేదు. ఇందులో ఎటువంటి దోషాలు లేవు. దీపారాధన మనం నిర్మల మనసు తో చేసేది, కానీ ఎటువంటి కక్కుర్తితో చేయటం లేదు. దీపం వెనకాల ఉన్న తత్వాన్ని గ్రహించి మనం చెయాలి.

మనం వెలిగించే దీపం ని ఒక్కసారి సరిగ్గా గమనిస్తే, దీపం లో పెట్టిన వత్తి కిందికి ఉన్నా కూడా జ్యోతి ఎప్పుడు పైకే ఉంటుంది. వత్తి కిందకి ఉంది కదా అని జ్యోతి కిందకి వాలిపోదు.

మనం దీపం ని వెలిగిస్తూ అనుకోవాలి, "భగవంతుడా! నాలో ఆలోచనలు కూడా ఈ దీపం లాగే ఎప్పుడు 'ఊర్ధ్వ ముఖంగా' ఉండేటట్టు చూడు. 'నేను', 'నా' అన్న స్వార్ధపు కోరికలనుండి బయటికి వచ్చి, అందరూ సకల సంతోషాల తో, నిత్య ఆనందం తో సుఖంగా ఉండాలి. "లోకా సంస్థాస్సుఖినో భవంతు". అనేలా నా ఆలోచనలు ఊర్ధ్వ ముఖంగా ఉండేలా జ్ఞానం నాకు కలుగచేసేది దీపం.

దీపం అంటే అగ్ని. అగ్నిలో ఏం వేసినా భస్మం అయిపోతుంది. అలాగే, మనలో, ఎదుటి మనిషిలో దోషాలు ఎత్తి చూపించడం, ఎదుటివ్యక్తిని చూసేటప్పటికి మనకు కోపం రావడం, పేరు విన్నంత మాత్రాన కూడా కోపంతో ముఖం మారిపోవడం, ఇలాంటి, అన్ని చెడు అభిప్రాయాలు మనలో దహనం అయిపోవాలి, మంచి మాత్రమే మిగలాలి. మంచి అంటే ఏంటి? మంచి అంటే "భస్మం", దానికి రంగు లేదు, ఏమి లేదు. దానినే మనం విభూతిలా నుదుటిన పెట్టుకుంటాం. 'నాకు మంచే మిగలాలి' అన్న జ్ఞానాన్ని కలుగచేసేది కూడా, ఈ దీపమే. ఇంత గొప్పతనం ఉన్న ఒక దీపాన్ని వెలిగిస్తూ, ఈ మూడు పాటించకుండా, అన్ని అనుమానాలతో మనసుని పాడు చూసుకోకూడదు.

దీపం వెలిగించే సమయం లో మనలో చాలా మంది అగ్గి పుల్లని గీసి, దానిమీదనే పడేస్తుంటాం. అలా చేయకూడదు. "దీపం జ్యోతి పరబ్రహ్మ" అంటారు. దీపం పరబ్రహ్మ స్వరూపం, అది మనకి ఇచ్చేది అపార 'జ్ఞానం'. అందువల్ల, అందులో వత్తి మిగిలిందా, నూనె మిగిలిందా, సగం కాలిందా అన్న విషయాలపై దృష్టి పెట్టకుండా, అది ప్రొద్దున్నైనా, సాయంకాలమైన సరే పూర్తి శ్రద్ధ తో వెలిగించాలి, ఆరాధించాలి.

ఎవర్రైనా దీపం ఎందుకు వెలిగించలేదండి? అని అడిగితే, ఏవో చిన్న చిన్న కారణాలు చెప్పడం కంటే, ఎంత ఉంటే అంతే... పూర్తి శ్రద్ధ తో దీపాన్ని వెలిగించాలి. దీపం ని ఆరాధనతో వెలిగించాలి కాబట్టి దీపారాధన అంటారు. అంటే దీప+ఆరాధన అని. దీపం కూడా దేవతే. ఏదో వెలిగించాలి కాబట్టి వెలిగించడం కాకుండా, ఆరాధన తో దేవత ని పూజించే అంత భక్తి శ్రద్ధ లతో దీపారాధన చేస్తే, ఇటువంటి సందేహాలు చాలా వరకు తొలగిపోతాయి.

ఎల్లప్పుడూ భగవంతుడి పూజా మందిరంలో దీపం వెలుగుతూ ఉండాలి, ఈ దీపమే అక్కరలేదు, ఒక విద్యుత్ దీపం అయినా సరే వెలుగుతూ ఉండాలి. ఇలా వెలిగించాడని కి వెనుక భావన ఏంటంటే, “బాలా త్రిపురసుందరి”, ఎనిమిది ఏళ్ల పిల్ల. చిన్న పాప చీకట్లో దడుచుకుంటుందేమో పాపం. అన్నంత దగ్గరగా తీసుకుంటున్నాం భగవంతుడిని. నా పాపకి భయమేస్తుందేమో? నా ఇంట్లోకొచ్చింది, అన్న భావన ఉండాలి. అలాగే భగవంతుడిని మనలో ఒక్కరిలా మనం కలుపుకోగలిగితే, సగానికి సగం సందేహాలు పటాపంచలవుతాయి. ఆ అమ్మవారికి ఆరాధన కింద ఒక “దీపంతో ఆరాధన చేస్తున్నాను” అని అనుకున్నప్పుడు ఎలా ఎప్పుడు వెలిగించిన కూడా ఫరవాలేదు.

# శ్రీవిద్యలో నా ప్రయాణం

జి. వైద్యనాథన్ గారు, హైదరాబాద్



**శ్రీ మాత్రే నమః**

నేను 2020లో కోవిడ్-19 మహమ్మారి వ్యాపించిన సమయంలో ఆన్‌లైన్‌లో శ్రీ విద్య ఇంగ్లీష్ మాడ్యూల్‌లో చేరాను. ఆ సమయంలో నా ఆరోగ్యం బాగాలేకపోయినా, సమతుల్యమైన జీవన విధానాన్ని కొనసాగించేందుకు శ్రీ విద్య సాధన నాకు సహాయం చేసింది. శ్రీ విద్య సాధన ద్వారా నేను నాలోని మార్పులను గమనించగలుగుతున్నాను. నా జీవితంలో అనేకమైన క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేటప్పుడు గురువు గారి బోధనలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి. నా ఉద్యోగంలో నేను చేసే పనియందు గణనీయమైన మార్పులు వచ్చాయి. వత్తిడులకు లోను కాకుండా నా వృత్తిని కొనసాగించి, ఉద్యోగంలో పురోగతిని సాదించగలిగాను.

నాకు చిన్నప్పటి నుంచి మితి మీరిన కోపం ఉండేది. శ్రీ విద్య యొక్క తీవ్రమైన సాధన నా కోపాన్ని చాలా వరకు తగ్గించింది.గురువు గారు మరియు అరుణాంబా అమ్మ దీనికి మార్గనిర్దేశం చేశారు. వారు ఉదాహరణ ద్వారా బోధిస్తారు. వారి ప్రేమ, సహనం మరియు సాధకుల పట్ల శ్రద్ధ, నమ్మకములను ప్రతి ఒక్కరూ అనుభూతి చెందవలిసినదే. మనమందరం ఒకే కుటుంబ సభ్యులం అనే భావన మనకందరికీ తెలియడం కోసం, లలితా కుటుంబం అనే గ్రూప్ లో మనలందరినీ సభ్యులుగా చేర్చి, గురువు గారు,మనందరికీ మార్గదర్శనం చేస్తున్నారు.
ఈ 3 సంవత్సరాల కాలంలో నా ఆరోగ్యంలో గొప్ప మెరుగుదలని గమనించాను. అప్రమత్తంగా ఉంటూ, వ్యావహారిక పనులలో ఉన్నప్పుడు కూడా శ్రీ విద్య విధానాన్ని వర్తింపజేయడంలో నేను ప్రారంభ దశలో ఉన్నాను.
మాడ్యూల్ 1-2 శ్రీ విద్యకు పునాదిని ఏర్పరుస్తుంది. శ్రీ విద్య గురించి అవగాహన కలిగించి కొత్త సాధకులను అందించడానికి మరియు సాధన ద్వారా జీవన విధానాన్ని కొనసాగించడానికి గురువు గారు వ్యక్తిగతంగా 3 - 4 సెషన్‌ల పాటు కోర్సును నిర్వహించడానికి అనేక జాగ్రత్తలు తీసుకుంటారు.సెషన్‌లు ఆన్‌లైన్‌లో ఉన్నప్పటికీ, గురువు గారు మరియు ఆయన బృందం సాధనలోని అభ్యాసాలను పూర్తి చేయమని మనలను ప్రేరేపించి, మన సాధనలోని పురోగతిని గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉంటారు.

మన గురువు గారి గురువు గారు(అన్నపూర్ణాంబా సహిత అమృతానందనాథ సరస్వతి) వారికి అందించిన ఈ విద్యను ప్రపంచవ్యాప్తంగా వీలైనంత ఎక్కువ మందికి, ఎటువంటి భేదం లేకుండా, పరిమితి లేకుండా, వ్యాప్తి చేయడమే గురువు గారి జీవిత లక్ష్యం. ఆయన జాతి, కుల, మత, లింగ, వయో భేదములతో లేకుండా ప్రతి ఒక్కరినీ శ్రీవిద్య లోనికి స్వాగతించారు.

శ్రీ విద్యా మాడ్యూల్‌లో నమోదు చేసుకోవడం కూడా అమ్మవారి అనుగ్రహంతో మాత్రమే జరుగుతుందని గురువు గారు తరచుగా చెబుతుంటారు. గురు కరుణ వలన, మొదట్లో నిరుత్సాహంగా కనిపించే సాధన తరువాతి కాలంలో చాలా వరకు సులభ సాధ్యమైంది.

శ్రీ విద్య జ్ఞాన పీఠానికి వెళ్లి గురువు గారు, అరుణాంబా అమ్మ మరియు లలిత కుటుంబ సభ్యులందరి సమక్షంలో ఉండటం మరియు సేవ చేయటం ఒక అద్భుతమైన అవకాశం. ఆసక్తి మరియు సామర్థ్యం ఆధారంగా సేవ చేయడానికి, పీఠంలో అనేక ఇతర అవకాశాలు కూడా అందించబడుతున్నాయి.

2023లో గురు పూర్ణిమ సందర్భంగా గురువు గారు మనలో కొందరికి పంచదశి దీక్షను అందించారు. గురువు గారు సూచించినట్లుగా, ఆ జగన్మాత మన హృదయాలలో నిలిచి ఉండేలా మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలి!! నిస్వార్థత, సేవ మరియు మౌనం పాటించడం ద్వారా ఇది సాధ్యపడుతుంది.

అమ్మవారి కృపకు పాత్రులయ్యేలా ప్రతి ఒక్కరూ సాధన చేసి శక్తిని పొందాలి! అని కోరుకుంటున్నాను.

శ్రీమాత్రేనమః





# నిజం తెలుసుకో

ఒకసారి రెండు రాజ్యాల మధ్య యుద్ధం జరిగింది. యుద్ధ విరమణ తరువాత ఒక రాజ్యానికి చెందిన ఒక సైనికుడు ఆ ప్రాంతంలో వెళుతుండగా, ఒకచోట ఒక చెట్టుకు ఒక డాలు వ్రేలాడుతూ కనబడింది. అదే సమయానికి ఎదుటివైపు నుండి రెండవ రాజ్యానికి చెందిన సైనికుడు అటువైపుగా వచ్చాడు. యుద్ధ విరమణ అయిపోయింది కనుక, ఇద్దరూ మాములుగానే పరస్పరం పలకరించుకున్నారు.

మొదటి సైనికుడు మిత్రమా ఆ చెట్టుకు వ్రేలాడుతున్న నీలి రంగు డాలు చాలా బాగున్నది కదా అని అన్నాడు.

రెండవ సైనికుడు అవును మిత్రమా ఆ డాలు చాలా బాగున్నది. కానీ అది, నీవు చెప్పినట్లు నీలి రంగులో లేదు, ఎరుపు రంగులో ఉన్నది అని అన్నాడు.

నీలి రంగులో ఉన్నది, సరిగా చూడు అని మొదటి వాడు అన్నాడు.

ఎరుపు రంగులో ఉన్నది నువ్వే సరిగా చూడు అని రెండవ వాడు అన్నాడు.

ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది.

ఇద్దరూ కత్తులు దూసుకుని యుద్ధం చేయడం ప్రారంభించారు.

అటుగా వెళుతున్న ఒక సాధారణ పౌరుడు వారిద్దరినీ చూసి, దగ్గరకు వచ్చి, వారిని ఆగమన్నాడు.

యుద్ధం ఆగిపోయింది కదా మీరిద్దరూ ఎందుకు యుద్ధం చేస్తున్నారు అని పౌరుడు అడిగాడు.

చూడవయ్యా, ఆ నీలిరంగు డాలును చూపించి ఇతడు ఎర్ర డాలు అంటున్నాడు అని మొదటి సైనికుడు అన్నాడు.
చూడవయ్యా అతని వగరుపాటు. ఎర్ర డాలును చూపించి నీలి డాలు అని చెబుతున్నాడు అని రెండవ సైనికుడు అన్నాడు.

అప్పుడు, పౌరుడు, మీరిద్దరూ సరిగానే చెప్పారు. కాకపోతే మీరు ఒకవైపే చూస్తూ అదే నిజం అని భ్రమలో పడి, ఒకరితో ఒకరు కొట్లాడుకుంటున్నారు. నిజానికి ఆ డాలు ఒకవైపు నీలి రంగు మరొక వైపు ఎరుపు రంగులతో ఉన్నది. జాగ్రత్తగా చూడండి అని చెప్పాడు.

ఇద్దరు సైనికులూ ఆ డాలును జాగ్రత్తగా పరిశీలించి, నిజం తెలుసుకుని, ఒకరికొకరు క్షమాపణలు చెప్పుకున్నారు.
మనం కూడా అసంపూర్ణంగా తెలిసిన విషయాలతోనూ, మిడి మిడి జ్ఞానంలో మునిగి తేలుతూ, అదే సర్వస్వం అనుకోకుండా, ప్రతి విషయాన్నీ పరిశోధించి, నిజం తెలుసుకుని మసలుకోవాలి.

# శ్లోకము

**శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే**
**శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః**
**యథా శివమయో విష్ణుం రేవం విష్ణుమయం శివః**
**యథ అంతరం న పశ్యామి తథామే స్వస్తిరాయుషీ.**

అర్థము : విష్ణు రూపములోనున్నది శివుడే. శివ రూపములోనున్నది విష్ణువే. శివుని హృదయంలో విష్ణువు ఉన్నాడు. అలాగే, విష్ణువు హృదయంలో శివుడున్నాడు. ఎక్కడ శివుడున్నాడో అక్కడే విష్ణువు ఉన్నాడు. ఎక్కడ విష్ణువు ఉన్నాడో అక్కడే శివుడు ఉన్నాడు. శివ కేశవుల మధ్య అంతరం అనగా భేదం చూడని వారికే మోక్షము కలుగును.

# మంచిమాట

జీవితంలో పైకి రావడానికి పంచసూత్రాలు :

1. సూర్యోదయానికి ముందే నిద్ర లేవడం
2. తలిదండ్రులను ఏ మాత్రం ఎదిరించకుండా ఉండడం
3. సృష్టించిన భగవంతుని పట్ల కృతజ్ఞతా పూర్వకంగా ప్రతి రోజూ ధ్యానం చేయడం
4. అసత్యమాడకుండా, సంఘటనలను ఎదుర్కొనే ధైర్యం కలిగి ఉండడం
5. నిరాశావాదం(మనవల్ల కాదు అనే భావం) వదిలిపెట్టడం.

# సెప్టెంబర్ నెలలో శ్రీవిద్యా జ్ఞాన పీఠం కార్యక్రమాలు

## గురూజీ టూర్ ప్రోగ్రామ్

- సెప్టెంబర్ 04 - సెప్టెంబర్ 29: USA లో వివిధ నగరాలు





- 6 శ్రీకృష్ణ జన్మాష్టమి
- 10 కామ ఏకాదశి
- 17 కల్కి జయంతి
- 18 వినాయక చవితి
- 19 ఋషి పంచమి
- 21 స్కంద షష్ఠి
- 23 కేదార వ్రతం
- 25 విష్ణు ఏకాదశి
- 26 వామన జయంతి
- 28 అనంత పద్మనాభ వ్రతం
- 30 మహాలయ పక్ష ఆరంభం

# గురూజీ 70వ జన్మదినోత్సవం సందర్భంగా ఉపాసులకు గురూజీ మరియు అమ్మ సందేశం

నా ప్రియ ఉపాసకులారా!

నేను నా 70వ సంవత్సరపు అంచులలో నిల్చున్నప్పుడు , నేను కృతజ్ఞతా భావంతో కూడిన అనుభూతులలో నిండిపోయాను. ఏడు దశాబ్దాల అనుభవాలు, పాఠాలు ప్రయాణంలో నాకు మార్గనిర్దేశం చేశాయి. వినయంతో మరియు ప్రేమతో నిండిన హృదయంతో నేను ఈ శుభ సందర్భంగా కొన్ని ఆలోచనలను మీతో పంచుకుంటున్నాను.

జీవిత ప్రయాణంలో అనేక మలుపులు ఉంటాయి. ఇక్కడ మన ఉద్దేశ్యం కేవలం ఉనికికి మించి విస్తరించిందని సంవత్సరాలు నాకు నేర్పించాయి; ఇది ప్రాపంచికతను అధిగమించి, అతీతమైన వాటిని స్వీకరించమని పిలుపు. జీవిత పరమార్థం కోసం అన్వేషణలో, మీ అంతరాత్మ యొక్క లోతులను పరిశోధించమని నేను మిమ్మల్ని కోరుకుంటున్నాను. ఎందుకంటే అన్ని జ్ఞానానికి మూలం అందులో ఉంది.

ఈ ప్రయాణంలో ఎప్పుడూ వచ్చే మార్పును స్వీకరించండి. ఋతువులు మారినట్లే మన జీవిత పరిస్థితులు కూడా మారతాయి. ఫలితాలతో అనుబంధాన్ని విడిచిపెట్టి, జీవిత ప్రవాహానికి లొంగిపోండి. ఈ శరణాగతిలో, నిజమైన స్వేచ్ఛ కనుగొనబడుతుంది.

హెచ్చు తగ్గులు, విజయాలు మరియు సవాళ్లు, ఇలా ప్రతి అనుభవం ఒక గురువు అని గుర్తుంచుకోండి. పెరుగుదల మరియు పరివర్తనకు ఉత్ప్రేరకంగా ప్రతికూలతను స్వీకరించండి. పరీక్షల ద్వారానే మనల్ని నిలబెట్టే పాత్ర యొక్క బలాన్ని మనం ఏర్పరుస్తాము.

జ్ఞాన సాధనలో, ఎప్పుడూ ఉత్సుకతతో ఉండండి. విశ్వం జ్ఞానం యొక్క అపరిమితమైన సముద్రం. మనం అవగాహన యొక్క సముద్రంలో విలీనం కావడానికి ప్రయత్నిస్తున్న చుక్కలు మాత్రమే. ప్రతి ఎన్‌కౌంటర్ నుండి మరియు మీ చుట్టూ ఉన్న ప్రపంచం నుండి నేర్చుకోవాలనే ఆసక్తితో ప్రతి రోజు విద్యార్థిగా ఉండండి. చంద్రయాన్ -3 విజయానికి దారితీసే పట్టుదల మార్గాన్ని మర్చిపోవద్దు.

నా అస్థిత్వానికి కారకులలో ముందుగా నా తల్లితండ్రులు శ్రీమతి యశోద మరియు శ్రీ సూర్యనారాయణ మూర్తి కొంపెల్ల మరియు నాలో జ్ఞాన జ్యోతిని వెలిగించిన నా గురువు శ్రీ శ్రీ శ్రీ అన్నపూర్ణాంబ సహిత శ్రీ అమృతానంద సరస్వతి మరియు నా శక్తి శ్రీమతి అరుణాంబ (ఉషా అమ్మ) మరియు నా పిల్లలకు నా ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు నా ప్రయాణాన్ని పదాలు వ్యక్తం చేయలేని విధంగా తీర్చిదిద్దారు.

నేను ఇంకా రాబోయే సంవత్సరాల దిగంతాలలోకి చూస్తున్నప్పుడు, నేను ఇంకా పూర్తి చేయాల్సిన సత్కర్మలు ఎన్నో కనబడుతున్నాయి. నా లక్ష్య సాధనలో మార్గనిర్దేశం చేయడం, ప్రేరేపించడం మరియు నేను ఎదుర్కొనే ప్రతి వారి సహజమైన దైవత్వాన్ని గ్రహించడంలో సహాయపడటం. జీవితం మరియు అంతరాత్మ యొక్క రహస్యాలను శోధిస్తున్నప్పుడు, చేయి చేయి కలిపి ఈ ప్రయాణాన్ని కొనసాగిద్దాం.

మీ అంతరాత్మ ప్రబోధమే మిమ్మల్ని నడిపించుగాక ! కరుణా తరంగాలు మిమ్మల్ని ముందుకు తీసుకెళ్ళుగాక!. మీ లోనే ఉన్న నిశ్చలతలో మీరు అపారమైన మన:శాంతి పొందుగాక! మరియు మీ హృదయాలు అన్ని జీవుల పట్ల అపరిమితమైన ప్రేమతో నిండి ఉండుగాక!

శాంతి, జ్ఞానం మరియు అంతులేని కృతజ్ఞతా ఆశీర్వాదాలతో
మీ
గురూజీ మరియు అమ్మ

# గురువాణి

కాల నిర్ణయ పట్టిక




శ్రీ శోభకృత్ నామ సంవత్సరం

# 2023

కలియుగాది 5124, శాలిశకం 1945

వర్ష ఋతువు నిజ శ్రావణమాసము

# AUGUST-SEPTEMBER

## పండుగలు

ఆగస్టు
17 సింహ సంక్రమణం
తె. 4.22 మఘకార్తె
18 శుక్రమౌఢ్య త్యాగం
19 వనదుర్గా సంచారం
20 నాగ చతుర్థి
దూర్వాగణపతి వ్రతం
21 గరుడ పంచమి
22 మంగళగౌరీ వ్రతం
**25 శ్రీవరలక్ష్మీ వ్రతం**
27 పుత్ర ఏకాదశీ
29 వరాహ జయతి

31 రాఖీపూర్ణిమ జంధ్యాల
పూర్ణిమ రక్షాబంధనం
పుబ్బకార్తె రా. 12.47

సెప్టెంబరు
6 శ్రీకృష్ణ జన్మాష్టమి
10 కామ ఏకాదశీ
13 మాస శివరాత్రి
14 సర్వ అమావాస్య,
ఉత్తరకార్తె సా. 6.41

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN**<br>భాను (ఆది)<br>రాహు సా.4.30 ల 6.00<br>సా.దు. 4.25 ల 5.13 | (పండుగలు) | **20** ౨౮<br>చవితి రా.8.57<br>హస్త రా.2.18<br>అమృ రా.7.48 ల 9.31<br>ఉ.వ. 9.26 ల 11.9 | **27** ౪<br>ఏకాదశీ సా.5.18<br>పూర్వాషాఢ రా.2.44<br>అమృ రా.10.09 ల 11.41<br>ప.వ.1.1 ల 2.32 | **3** ౧౧<br>చవితి రా.11.17<br>రేవతి సా.4.8<br>అమృ ప.1.51 ల 3.22<br>ఉ.వ. 6.15 వరకు | **10** ౧౮<br>ఏకాదశీ రా.10.21<br>పునర్వసు రా.7.15<br>అమృ సా.4.39 ల 6.22<br>ఉ.వ. 6.18 ల 8.2<br>రా.వ. 3.59 ల 5.43 |
| **MON**<br>ఇందు (సోమ)<br>రాహు ఉ.7.30 ల 9.00<br>ప.దు. 12.24 ల 1.12<br>ప.దు. 2.46 ల 3.34 | | **21** ౨౯<br>పంచమి రా.9.53<br>చిత్ర రా.3.49<br>అమృ రా.9.0 ల 10.42<br>ప.వ. 10.48 ల 12.30 | **28** ౫<br>ద్వాదశీ ప.3.12<br>ఉత్తరాషాఢ రా.1.17<br>అమృ రా.7.16 ల 8.46<br>ప.వ.10.14 ల 11.45<br>తె.వ. 5.01 ల | **4** ౧౨<br>పంచమి రా.9.47<br>అశ్విని ప.3.16<br>అమృ ఉ.8.19 ల 9.51<br>ప.వ. 11.24 ల 12.56<br>రా.వ.12.39 ల 2.13 | **11** ౧౯<br>ద్వాదశీ రా.12.2<br>పుష్యమి రా.9.29<br>అమృ ప.2.28 ల 4.12<br>వర్జ్యము లేదు |
| **TUE**<br>భౌమ(మంగళ)<br>రాహు ప.3.00 ల 4.30<br>ఉ.దు. 8.24 ల 9.12<br>రా.దు. 10.46 ల 11.36 | | **22** ౩౦<br>షష్ఠి రా.10.18<br>స్వాతి తె.4.46<br>అమృ రా.7.36 ల 9.16<br>ప.వ. 9.38ల 11.17 | **29** ౬<br>త్రయోదశీ ప.12.56<br>శ్రవణం రా.11.43<br>అమృ ప.1.59 ల 3.29<br>ఉ.వ. 6.30 వరకు<br>రా.వ.3.26 ల 4.55 | **5** ౧౩<br>షష్ఠి రా.8.39<br>భరణి ప.2.45<br>అమృ ప.10.3 ల 11.37<br>రా.వ. 2.43 ల 4.18 | **12** ౨౦<br>త్రయోదశీ రా.2.1<br>ఆశ్రేష రా.12.00<br>అమృ రా.10.13 ల 12.00<br>ప.వ. 11.37 ల 1.23 |
| **WED**<br>సౌమ్య(బుధ)<br>రాహు ప.12.00 ల 1.30<br>ప.దు. 11.36 ల 12.24 | | **23** ౩౧<br>సప్తమి రా.10.15<br>విశాఖ తె.5.18<br>అమృ రా.8.17ల 9.55<br>ప.వ.10.29ల 12.7 | **30** ౭<br>చతుర్దశీ ప.10.32<br>ధనిష్ఠ రా.10.2<br>అమృ ప.12.21 ల 1.50<br>తె.వ. 4.43 ల 6.12 | **6** ౧౪<br>సప్తమి రా.8.1<br>కృత్తిక రా.2.42<br>అమృ ప.12.17 ల 1.53<br>వర్జ్యము లేదు | **13** ౨౧<br>చతుర్దశీ తె.4.6<br>మఘ రా.2.37<br>అమృ రా.11.57 ల 1.44<br>ప.వ.1.18 ల 3.5 |
| **THU**<br>బృహస్పతి(గురు)<br>రాహు ప.1.30 ల 3.00<br>ప.దు. 10.00 ల 10.48<br>పు.దు. 2.48 ల 3.36 | **17** ౨౫<br>నిజశ్రావణశుక్లపాడ్యమి సా.3.52<br>మఘ రా.7.32<br>అమృ సా.4.51ల 6.38<br>ఉ.వ.6.12 ల 7.59<br>తె.వ. 4.22ల | **24** భా౧<br>అష్టమి రా.9.39<br>అనూరాధ తె.5.16<br>అమృ రా.6.52 ల 8.28<br>ప.వ.9.17 ల 10.53 | ○ **31** ౮<br>m పూర్ణిమ ఉ.8.3<br>బ.పాడ్యమి తె.5.36<br>శతభిషం రా.8.21<br>అమృ ప.1.38 ల 3.8<br>ఉ.వ.6.12వ రా.వ.2.19ల3.49 | **7** ౧౫<br>అష్టమి రా.7.50రోహిణి ప.3.6<br>అమృ ప.11.50 ల 1.28<br>ఉ.వ. 6.57 ల 8.35<br>రా.వ.8.54 ల 10.34 | **14** ౨౨<br>1 అమావాస్య పూర్తి<br>పుబ్బ తె.5.13<br>అమృ రా.10.7 ల 11.53<br>ప.వ. 11.28 ల 1.15 |
| **FRI**<br>భృగు (శుక్ర)<br>రాహు ప.10.30 ల 12.00<br>ఉ.దు.8.24 ల 9.12<br>పు.దు. 12.24 ల 1.12 | **18** ౨౬<br>విదియ సా.5.48<br>పుబ్బ రా.10.3<br>అమృ ప.2.58 ల 4.44<br>ఉ.వ. 6.8 వరకు | **25** ౨<br>నవమి రా.8.31<br>జ్యేష్ఠ రా.4.44<br>అమృ రా.8.8 ల 9.42<br>ప.వ.10.44 ల 12.18 | నిజ శ్రావణ బహుళ **1** ౯<br>విదియ రా.3.17<br>పూర్వాభాద్ర సా.6.46<br>అమృ ప.11.17 ల 12.46<br>రా.వ.3.47 ల 5.17 | **8** ౧౬<br>నవమి రా.8.12<br>మృగశిర సా.4.1<br>అమృ ఉ.6.52 ల 8.32<br>రా.వ.12.53 ల 2.35 | ● **15** ౨౩<br>1 అమావాస్య ఉ.6.5<br>ఉత్తర పూర్తి<br>అమృ రా.11.37 ల 1.22<br>ప.వ. 1.6 ల 2.51 |
| **SAT**<br>స్థిర (శని)<br>రాహు ఉ.9.00 ల 10.30<br>ఉ.దు. 6.00 ల 7.36 | **19** ౨౭<br>తదియ రా.7.34<br>ఉత్తర రా.12.22<br>అమృ సా.4.28 ల 6.13<br>ఉ.వ.5.56 ల 7.42 | **26** ౩<br>దశమి రా.9.5మూల రా.3.53<br>అమృ రా.9.41 ల 11.14<br>ప.వ. 12.26 ల 1.59<br>రా.వ. 2.19 ల 3.52 | **2** ౧౦<br>తదియ రా.1.8<br>ఉత్తరాభాద్ర సా.5.20<br>అమృ ప.12.48 ల 2.18<br>తె.వ.4.44 ల | **9** ౧౭<br>దశమి రా.9.1<br>ఆర్ద్ర సా.5.23<br>అమృ ఉ.6.48 ల 8.30<br>వర్జ్యము లేదు |  |

# గురువాణి

కాల నిర్ణయ పట్టిక





శ్రీ శోభకృత్ నామ సంవత్సరం

# 2023

కలియుగాది 5124, శాలిశకం 1945

వర్ష ఋతువు **భాద్రపద మాసము**

## SEPTEMBER-OCTOBER

### పండుగలు

సెప్టెంబరు

17 కల్కి జయంతి
18 పదహారు కుడుముల తద్దె
**వినాయక చవితి**
గణపతి నవరాత్రారంభం
19 ఋషి పంచమి
21 స్కంద షష్టి
22 దూర్వాష్టమి
23 నందాదేవి పూజా
కేదారవ్రతం
25 విష్ణు ఏకాదశి
26 వామన జయంతి
28 అనంత పద్మనాభవ్రతం
హస్తకార్తె ఉ. 9. 46
30 మహాలయ పక్షారంభః

అక్టోబర్

1 ఉండ్రాళ్ళతద్దె
2 సంకటహర చతుర్థి
10 నిర్జల ఏకాదశి
11 చిత్తకార్తె రా. 10.5
12 మాస శివరాత్రి
14 మహాలయ అమావాస్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN** భాను (ఆది)<br>రాహు సా.4.30 ల 6.00<br>సా.దు. 4.25 ల 5.13 | | **17** ౨౫<br>**విదియ** ప.9.16<br>హస్త ప.9.31<br>అమృ రా.4.16 ల 5.58<br>రా.వ.6.2 ల 7.44 | **24** అశ్వి౧<br>**నవమి** ఉ.5.56 దశమి రా.3.56<br>పూర్వాషాఢ ప.10.38<br>అమృ ఉ.6.02 ల 7.34<br>పునరమృ రా.3.14 ల 4.44<br>రా.వ.6.10 ల 7.41 | భాద్రపద బహుళ **1** ౮<br>**విదియ** ప.12.13<br>అశ్విని రా.11.3<br>అమృ సా.4.8 ల 5.40<br>రా.వ.7.13 ల 8.45 | **8** ౧౫<br>**నవమి** ప.11.25<br>పుష్యమి తె.4.29<br>అమృ రా.9.31 ల 11.16<br>ప.వ.11.5 ల 12.49 |
| **MON** ఇందు (సోమ)<br>రాహు ఉ.7.30 ల 9.00<br>ప.దు. 12.24 ల 1.12<br>ప.దు. 2.46 ల 3.34 | | **18** ౨౬<br>**తదియ** ప.10.15<br>చిత్ర ప.11.5<br>అమృ రా.2.57 ల 4.37<br>సా.వ. 4.55 ల 6.36 | **25** ౨<br>**ఏకాదశీ** రా.1.42<br>ఉత్తరాషాఢ ప.9.17<br>అమృ రా.10.1 ల 11.30<br>ప.వ. 1.1 ల 2.31 | **2** ౯<br>**తదియ** ప.10.43<br>భరణి రా.10.28<br>అమృ సా.5.47 ల 7.20<br>ఉ.వ. 8.25 ల 9.58 | **9** ౧౬<br>**దశమి** ప.1.8<br>ఆశ్రేష పూర్తి<br>అమృ తె.5.16లగా<br>రా.వ. 6.38ల 8.24 |
| **TUE** భౌమ(మంగళ)<br>రాహు ప.3.00 ల 4.30<br>ఉ.దు. 8.24 ల 9.12<br>రా.దు. 10.46 ల 11.36 | | **19** ౨౭<br>**చవితి** ప.10.42<br>స్వాతి ప.12.9<br>అమృ రా.3.42 ల 5.21<br>సా.వ. 5.53 ల 7.31 | **26** ౩<br>**ద్వాదశీ** రా.11.16<br>శ్రవణం ఉ.7.45<br>అమృ రా.8.24 ల 9.53<br>ప.వ.11.28 ల 12.57 | **3** ౧౦<br>**చవితి** ప.9.38<br>కృత్తిక రా.10.17<br>అమృ రా.7.53ల 9.28<br>ప.వ.10.22 ల 11.57 | **10** ౧౭<br>**ఏకాదశీ** ప.3.8<br>ఆశ్రేష ఉ.7.3<br>అమృ ఉ.7.3 వరకు<br>రా.వ. 8.22 ల 10.8 |
| **WED** సౌమ్య(బుధ)<br>రాహు ప.12.00 ల 1.30<br>ప.దు. 11.36 ల 12.24 | | **20** ౨౮<br>**పంచమి** ప.10.39<br>విశాఖ ప.12.44<br>అమృ రా.2.23 ల 3.59<br>సా.వ.4.44 ల 6.21 | **27** ౪<br>**త్రయోదశీ** రా.8.49<br>ధనిష్ఠ ఉ.6.5శతభిషంరా.4.24<br>అమృ రా.9.41 ల 11.11<br>ప.వ. 12.46 ల 2.15 | **4** ౧౧<br>**పంచమి** ప.8.59<br>రోహిణి రా.10.32<br>అమృ రా.7.18ల 8.55<br>ప.వ.2.27 ల 4.4<br>రా.వ.4,19ల 5.58 | **11** ౧౮<br>**ద్వాదశీ** సా.5.15<br>మఘ ప.9.39<br>అమృ ఉ.7.1 ల 8.48<br>పునరమృ తె.5.8ల<br>రా.వ. 6.30 ల 8.16 |
| **THU** బృహస్పతి(గురు)<br>రాహు ప.1.30 ల 3.00<br>ప.దు. 10.00 ల 10.48<br>పు.దు. 2.48 ల 3.36 | | **21** ౨౯<br>**షష్ఠి** ప.10.7<br>అనూరాధ రా.12.50<br>అమృ రా.3.48 ల 5.22<br>రా.వ. 6.20 ల 7.55 | **28** ౫<br>**చతుర్దశీ** సా.6.24<br>పూర్వాభాద్ర రా.2.45<br>అమృ రా.7.18 ల 8.47<br>ప.వ.10.21 ల 11.51 | **5** ౧౨<br>**షష్ఠి** ఉ.8.50<br>మృగశిర రా.11.21<br>అమృ ప.2.14 ల 3.54<br>ఉ.వ. 5.58 వరకు | **12** ౧౯<br>**త్రయోదశీ** రా.7.17<br>పుబ్బ ప.12.13<br>అమృ ఉ.6.54 వరకు<br>రా.వ. 8.8ల 9.53 |
| **FRI** భృగు (శుక్ర)<br>రాహు ప.10.30 ల 12.00<br>ఉ.దు.8.24 ల 9.12<br>పు.దు. 12.24 ల 1.12 | | **22** ౩౦<br>**సప్తమి** ప.9.8<br>జ్యేష్ఠ ప.12.29<br>అమృ తె.5.31 ల<br>రా.వ. 8.13 ల 9.46 | ○ **29** ౬<br>m **పూర్ణిమ** సా.4.8<br>ఉత్తరాభాద్ర రా.1.16<br>అమృ రా.8.45 ల 10.15<br>ప.వ. 11.45 ల 1.15 | **6** ౧౩<br>**సప్తమి** ప.9.12<br>ఆర్ద్ర రా.12.36<br>అమృ ప.2.4 ల 3.45<br>ఉ.వ.8.11 ల 9.52 | **13** ౨౦<br>**చతుర్దశీ** రా.9.7<br>ఉత్తర ప.2.38<br>అమృ ఉ.6.41 ల 8.27<br>రా.వ.11.46ల 1.30 |
| **SAT** స్థిర (శని)<br>రాహు ఉ.9.00 ల 10.30<br>ఉ.దు. 6.00 ల 7.36 | **16** ౨౪<br>**భాద్రపదశుక్లపాడ్యమి** ఉ7.52<br>ఉత్తర ఉ.7.31<br>అమృ రా.3.00 ల 4.44<br>సా.వ. 4.36 ల 6.20 | **23** ౩౧<br>**అష్టమి** ఉ.7.42 మూలప.11.43<br>అమృ ఉ.7.4 వరకు<br>ప.వ.10.10ల 11.43<br>రా.వ. 8.52 ల 10.24 | **30** ౭<br>**బ.పాడ్యమి** ప.2.2<br>రేవతి రా.12.2<br>అమృ రా.9.44 ల 11.15<br>ప.వ.12.38 ల 2.9 | **7** ౧౪<br>**అష్టమి** ప.10.5<br>పునర్వసు రా.2.23<br>అమృ రా.11.48 ల 1.31<br>పవ. 1.29 ల 3.12 | ● 1 **14** ౨౧<br>**అమావాస్య** రా.10.36<br>హస్త సా.4.45<br>అమృ ప.10.12 ల 11.57<br>రా.వ.1.18 ల3.1 |

## సూక్తి

మనకు మనమే నిర్మించుకున్న హద్దులు లేదా అడ్డుగోడల వలన,
మనలోని చైతన్యం జడ పదార్థం లాగా నిలబడిపోతున్నది.
శ్రీవిద్య, ఈ రకమైన అడ్డంకులను తొలగించి,
మనలను చైతన్య వంతులుగా మారుస్తుంది.

~ శ్రీ గురు కరుణామయ



gurUvaani


**Srividya Learning Centre**
#69, 6th Cross Street,
Girinagar Phase I, Bengaluru,
KA 560085, India.

srimeru999@gmail.com
+91 8088256632
www.srimeru.org


Guruvaani is a Digital monthly newsletter published in English & Telugu by Srividya Learning Centre.